కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక

ఫిబ్రవరి 2010



కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాస పత్రిక


సంచిక: 11 ఫిబ్రవరి 2010 సంపుటి: 2

(http://kottapalli.in లోని e - సంచికకు పుస్తక రూపం)

ఈ సంచికలో....

ముఖచిత్రం: హేమంతం

చిత్రకారుడు: వీరాంజనేయులు



దొరలు దోచలేరు, దొంగలెత్తుకపోరు

భ్రాతృ జనము వచ్చి పంచుకోరు

విశ్వ వర్ధనంబు విద్యాధనమ్మురా

లలిత సుగుణజాల! తెలుగు బాల!



వాస్తవం

ఎ.కె.రామానుజన్ గారు చెప్పిన హాస్యకథ ఒకటుంది-

కాబూల్ నుండి భారతదేశాన్ని చూసిపోయేందుకు వచ్చాడట, అబు. ఓ పట్టణంలో వీధివెంబడి నడుస్తూ నడుస్తూ, వాడు ఒక మిఠాయిలమ్మే దుకాణం ముందుకొచ్చి నిలబడిపోయాడు. ఆ దుకాణంలో నిండుగా మిఠాయిలు! కళ్లు చెదిరే రంగుల్లో, వేర్వేరు ఆకారాల్లో, వేరువేరు సైజుల్లో అందంగా, ఆకర్షణీయంగా అమర్చి ఉన్నాయి!

అబుకు భారతదేశపు భాషలేవీ రావు. హిందీలో ఒకటి రెండు ముక్కలు మాత్రం ఎక్కడో విని



ఉన్నాడు-అంతే. మరి, మిఠాయిలేమో నోరూరిస్తున్నాయి. వాటిలో "చాలా బాగుంటుందేమో" అనిపించేలా ఉండింది ఓ మిఠాయి. గుండ్రంగా, చక్రాలుగా, చక్కెర చల్లినట్లున్న ఆ మిఠాయిని చూసి అబు ఆగలేకపోయాడు. ఆ దుకాణదారు దగ్గరికి వెళ్లి నిలబడి, ఆ మిఠాయికేసి చేత్తో చూపించాడు.

దుకాణదారుకు అబు 'పరదేశీ' అని అర్థం అయింది. 'పరదేశం వాడు ఆ మిఠాయి పేరు అడుగుతున్నాడేమో' అని అతననుకొని, గట్టిగా చెప్పాడు "ఖాజా" అని.

హిందీలో "ఖాజా" కు ఇంకో అర్థం కూడా ఉంది- “తినేసెయ్యి!" అని. దురదృష్టం కొద్దీ, అబుకు "ఖాజా" అంటే " తినేసెయ్యి!" అని తెలుసు! అందుకని వాడు వెంటనే పోయి, సంతోషంగా ఆ మిఠాయిల్ని అన్నిటినీ తీసుకొని, ఒకదాని తర్వాత ఒకటి కడుపారా మెక్కేశాడు! బాగా తిన్నాక, 'ఇక చాల్లే' అనుకొని వాడు వెనుతిరిగి పోతుంటే, దుకాణంవాడు ఆపి, డబ్బులు చెల్లించమన్నాడు.

కానీ దుకాణదారు ఏమంటున్నదీ చెవి చించుకున్నా అబుకు అర్థం కాలేదు! దుకాణంవాడు ఏదేదో అంటూపోయాడు గానీ, కడుపునిండిన సంతోషంలో ఉన్న అబు వాటిని అసలు పట్టించుకోలేదు. ఇక వాడిని ఏమనీ ప్రయోజనం లేదని అర్థమైన దుకాణదారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

వాళ్లొచ్చి అబును పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తీసుకుపోయారు. అక్కడ పోలీసు ఇన్స్పెక్టరు ఏమన్నా అబుకు అర్థంకాక, చిద్విలాసంగా నవ్వు ముఖం పెట్టుకొని నిలబడ్డాడు తప్పిస్తే, మరేమీ జవాబివ్వలేదు. చివరికి విసిగిపోయిన ఇన్స్పెక్టరు తనే సొంతంగా శిక్ష వేయాలని నిశ్చయించుకున్నాడు. 'అబు తల నున్నగా గొరిగించి, తారుతో గుండుకు పెయింట్ వేయించి, వాడినో గాడిద మీద కూర్చోబెట్టి, మేళతాళాలతో నగర వీధుల్లో ఊరేగించాలని, చట్టాన్ని అతిక్రమిస్తే ఏమౌతుందో అలాగైనా అందరికీ తెలిసివస్తుందని' ఆదేశించాడాయన.

పోలీసులు ఆ శిక్షను ఉత్సాహంగా అమలు పరిచారు. ఊళ్లో జనాలంతా గాడిద వెంబడి నడుస్తూ, గుమిగూడి వినోదంగా నవ్వితే అబుకు చాలా సంతోషం అయింది. ఆ చర్యని ఇక్కడ గొప్ప అవమానంగా భావిస్తారని కూడా వాడికి అర్థం కాలేదు. పైపెచ్చు, తనని భారతీయులు ఎంత ఉత్సాహంగా గౌరవించారో తలచుకొని వాడు పొంగిపోయాడు.

ఆ తరువాత కొన్నిరోజులకు, అబు కాబూలుకు తిరిగి వెళ్లిన తర్వాత, అక్కడి వాళ్లు అడిగారు వాడిని- 'భారతదేశం ఎట్లా ఉన్నది?' అని.

“ఆహా! ఏం చెప్పేది?! అద్భుతమైన దేశం,అది! చాలా ధనిక దేశం, నిజంగా! ఏ వస్తువైనా సరే, మనకు ఊరికే ఇచ్చేస్తారు అక్కడ! మనం ఏమీ చెల్లించనక్కర్లేదు!! మనం ఏదైనా మిఠాయిల దుకాణం ముందు నిలబడి, మనకు నచ్చిన మిఠాయిలకేసి చెయ్యెత్తి చూపిస్తే చాలు- “మీకు నచ్చినన్ని తీసుకొని తినండి" అంటారు వాళ్ళు. ఆపైన మనం ఇష్టమున్నట్లు తినచ్చు. ఇక అక్కడి పోలీసులు- బాజా భజంత్రీలు పట్టుకొని వస్తారు. వాళ్ళు మనకు చక్కగా తలపని చేసి, తలకు హెయిర్ డ్రై పట్టిస్తారు. అంతేకాదు, మనల్ని ఓ మంచి గాడిద మీద కూర్చో బెట్టి, పట్టణం అంతా తిప్పి చూపిస్తారు కూడా. -అదీ ఒంటరిగా కాదు! చక్కటి సంగీతం వాయించే సంగీతబృందాన్నొకదాన్ని మనతోబాటుగా పంపిస్తారు! ఇదంతా ఉచితమే, మనం ఒక్క దమ్మిడీ కూడా చెల్లించాల్సిన అవసరం లేదు!! గొప్ప దేశం అది, నిజంగా! చాలా మంచి ప్రజలు. అతిథుల్ని గౌరవించేదెలాగో మనం వాళ్ల నుంచి నేర్చుకోవాలి!” అన్నాడు అబు, మనందరికీ మనస్ఫూర్తిగా ధన్యవాదాలర్పిస్తూ!


దేన్ని గురించైనా మనం అనుకునే తీరు మన ఆలోచనల్ని బాగా ప్రభావితం చేస్తుంది. అందుకని మనం అనుకునేవి వాస్తవానికి దగ్గరగా ఉంటే మంచిది. అలాకాక మనం బండరాళ్లను కొండలుగాను, కొండల్ని మట్టి బెడ్డలుగాను అనుకుంటే, వాటికేమీ అవ్వదు- ఎప్పుడో ఒకసారి మనమే నవ్వులపాలయ్యే ప్రమాదం ఉన్నది. ఏమంటారు?

ఈనెల ముఖచిత్రం, పతాకచిత్రం చిత్రకారుడు శ్రీ.వీరాంజనేయులుగారి సృజనలు. వారికి ధన్యవాదాలు.

అభినందనలతో,

కొత్తపల్లి బృందం.





నీతి చంద్రిక

4 వ భాగం

మూల రచన: కీ.శే. పరవస్తు చిన్నయసూరి　　*సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

జరిగిన కథ: లఘుపతనకం హిరణ్యకుడితో స్నేహం కోరుతుంది. అప్పుడది అందుకు ఒప్పుకోదు-- కాకి జింక-నక్కల కథ చెప్పటం మొదలెడుతుంది. ఆ కథలో కాకి- జింకలు స్నేహంగా ఉంటై. జింకను తినాలనుకున్న నక్క ఒకటి దాన్ని మురిపించి, దానితోబాటు ఇంటికి వస్తుంది. ఆలోచన లేకుండా నక్కను నమ్మిందని జింకను తప్పుపడుతూ, కాకి దానికి' జరద్గవం' అనే ముసలి గ్రద్ధ కథ చెబుతుంది. ఇక చదవండి...

(గత సంచిక తరువాయి..) అప్పుడు నక్క కాకికేసి కొరకొరా చూస్తూ "మొదటిసారి చూసినప్పుడు జింకకు నువ్వుకూడా కొత్తదానివే. మరి నీకు- జింకకు మధ్య స్నేహం

రాను రానూ ఎందుకు బలపడుతున్నది? ఏమీ అడ్డు లేదు గనుక, నీ నోటికి వచ్చినట్లు నీతులు వల్లిస్తున్నావు. పండితులు లేనిచోట, కొంచెం బుద్ధి ఉన్నవాడికి కూడా గౌరవం లభిస్తుంటుంది. చెట్లు లేని దేశంలో ఆముదపు చెట్టే మహావృక్షం కాదూ? అల్ప బుద్ధి కలవారికి వీడు తనవాడు, వీడు పరాయివాడు' అని ఎంచ బుద్ధవుతుంది. మహాత్ములకు ఈ లోకమంతా కుటుంబమే. ఈ జింక నాకెంత బంధువో నువ్వూ అంతే బంధువువు, కాదా? ఈ ప్రపంచం ఉన్నంత కాలం ఎవ్వరమూ ఉండబోము. అందరినీ ఎప్పుడో ఒకప్పుడు మింగేందుకు యముడు కాచుకొని కూర్చున్నాడు. మనం ఇక్కడ ఉన్న సమయంలో అందరిచేతామంచివాడు' అనిపించుకొని పోవాలిగాని, ఇట్లాంటి కుళ్ల బుద్ధి వల్ల లాభం ఏంటి?" అని తిట్టింది.

అప్పుడు జింక "ఈ వాదులాట ఎందుకు? మనం అందరం కలిసిమెలిసి ఉందాం. మంచి మాటలతో సుఖంగా కాలక్షేపం చేద్దాం. `వీడికి వీడు మిత్రుడు; వీడు శత్రువు' అని నియమాలేమీ ఉండవుకదా? ప్రవర్తన వల్లనే ఎవరైనా మిత్రులు, శత్రువులు అవుతూంటారు" అన్నది.

ఆ మాటలు విని కాకి "సరే, అలాగే కానీ" అని ఊరుకున్నది. తరువాత జింక, కాకి, నక్కలు చాలా స్నేహంగా ఆ అడవిలో ఉంటూ వచ్చాయి.



ఇలా కొంతకాలం గడిచిన తర్వాత ఒకరోజున నక్క జింకతో - "నేను ఈ రోజున ఒక పొలాన్ని చూశాను. దాని నిండుగా పచ్చని పంట ఉన్నది. నువ్వు నాతోరా. నీకు ఆ పొలాన్ని

చూపిస్తాను" అని చెప్పి, తను దగ్గరుండి ఆ జింకను వెంటబెట్టుకొనిపోయి, ఆ పంటపొలాన్ని చూపించింది. ఆ నాటినుండి జింక ప్రతిరోజూ అక్కడికే వెళ్లి పంటను మేయటం మొదలుపెట్టింది.

పొలపు రైతు ఒకరోజున దాన్ని చూసి "అరే! ఈ జింక పైరు మేయ మరిగింది. దీన్ని ప్రాణాలతో వదలకూడదు" అనుకొని, రహస్యంగా పొలంలో వల పన్ని, ఇంటికి వెళ్లాడు.

అలవాటు కొద్దీ మర్నాడు అక్కడికి వచ్చిన జింక, పొలంలోకి దిగీ దిగగానే ఆ వలలో చిక్కుకున్నది.



"అయ్యో! వలలో చిక్కుకున్నానే! ఏమి చేయాలి? యముడి పాశం లాంటి ఈ వల నుండి నన్ను విడిపించే దిక్కెవ్వరు? నా నేస్తమైన నక్క వస్తే బాగుండును- ఇప్పుడు నన్ను ఈ ఆపదనుండి అది కాపాడగలదు కదా!" అని అది వాపోయింది.

అంతలోనే అక్కడికి చేరుకున్న నక్క వలలో చిక్కుకున్న జింకను చూసి, మనసులో ఎంతో సంతోషపడి, "ఆహా! నా ప్రయత్నం ఇన్నాళ్లకు కదా, సఫలమైంది! పొలపు కాపు ఇవాళ్ల దీన్ని చంపక మానడు. దీని రక్తమాంసాలు అతుక్కున్న ఎముకలు నాకు కావలసినన్ని దొరుకుతాయి, ఈ రోజు నాకు నిజంగా పండుగ రోజే! " అనుకుంటూ జింక దగ్గరికి పోయింది.

ఆ అమాయకపు జింకేమో నక్కను చూసి, ఇక తనకు భయంలేదు అనుకొని, "నేస్తమా! వెంటనే వచ్చి, వల కొరికి, నన్ను కాపాడు!" అన్నది.

అప్పుడు నక్క మెల్లగా దాన్ని చేరి, వలను దీక్షగా చూస్తూ- "అయ్యో! మిత్రమా! ఈ వలను సన్నటి నరాలతో చేసినట్లుందే! మరి ఈ

రోజు, చూడగా ఆదివారం. ఆదివారంనాడు పళ్లతో నరాల్ని నేనెట్లా తాకేది? నన్ను తప్పుగా అనుకోకు, ఈ పని ఒక్కటీ తప్ప, వేరే ఏ పని చెప్పినా నేను తప్పకుండా చేసిపెడతాను" అన్నది.

ఇక మెల్లగా సాయంత్రం అయ్యింది. కాకి తన స్నేహితుడైన జింక 'ఇంకా ఇంటికి చేరుకోలేదేమి?' అని చాలా కంగారుపడి, అక్కడా ఇక్కడా వెతుకుతూ, చివరికి ఆ పొలం దగ్గరకు వచ్చి చూసింది. అక్కడ వలలో చిక్కుకున్న జింకను కనుగొని, అది కళ్లనీళ్లు పెట్టుకొని, "మిత్రమా, ఇదేంటి?" అని అడిగింది.



"స్నేహితుడి మాట వినకపోవడం వల్ల కలిగిన ఫలితం ఇది. వినాశకాలం వచ్చినప్పుడు మేలుకోరే వాళ్ల మాటలు ఎందుకు వింటాం?" అని బాధపడింది జింక.

"మరి ఆ నక్క ఏది?" అని అడిగింది కాకి.

"నా మాంసం తినాలని ఇక్కడే ఎక్కడో కాచుకొని ఉన్నది!" అని చెప్పింది జింక.

అప్పుడు కాకి "నేను ముందే చెప్పాను- అయినా నా మాట వినలేదు నువ్వు. 'నేను ఇతరులకు కీడు చేయను, కాబట్టి వాళ్ళూ నాకు కీడు తలపెట్టరు' అని నమ్మటానికి లేదు. మంచివాళ్లకు కూడా దుష్టుల వల్ల కష్టాలు తలెత్తుతాయి. పోయేకాలం దాపురించిన వాళ్ళు- "దీపం ఆరిపోయినప్పటి వాసనను పీల్చరు; అరుంధతీ నక్షత్రాన్ని చూడరు; స్నేహితుల సలహాలను వినరు"-అని పెద్దలు చెబుతారు. ఎదురుగా ఉన్నప్పుడు మెత్తగా మాట్లాడి, చాటున కీడు తలపెట్టేవాడు స్నేహితుడు కాడు- పాల మరుగున ఉన్న విషపు కుండ లాంటివాడు. అట్లాంటి వాడితో స్నేహాన్ని తప్పకుండా వదిలిపెట్టాలి" అన్నది.

అప్పుడు జింక నిట్టూర్చింది.

"మంచివాళ్లతో సహవాసం వల్ల ఎంత మంచి జరుగుతుందో, చెడ్డవాళ్లతో సహవాసం వల్ల అన్ని నష్టాలూ ఒనగూరుతాయి-సందేహం లేదు. ఆ జిత్తులమారి నక్క తేనె పలుకులకు మోసపోయాను. ఆ దుష్టునికి 'నాలిక తీపి-లోన విషం' అని తెలుసుకోలేకపోయానే? " అని అది వాపోయింది.

అంతలో దూరంగా నడిచి వస్తున్న పొలం కాపును చూసింది కాకి. "మిత్రమా! ఇప్పుడు తగిన ఉపాయం ఆలోచించకుండా ఆలస్యం చేయకూడదు. అదిగో, రైతు వచ్చేస్తున్నాడు, దుడ్డుకర్రను చేత పట్టుకొని, యముడిలాగానే తోస్తున్నాడు అతను. నాకొక ఉపాయం తోస్తోంది, విను. నువ్వు ఊపిరి బిగపట్టి, కడుపును ఉబ్బించి, నాలుగు కాళ్లనూ నీల్గించి, బిర్ర బిగుసుకొని, చచ్చిపోయినట్లు పడి ఉండు. నేను నీమీద ఎక్కి, ముక్కుతో నీ కళ్ళు పొడుచుకొని తినేదాని మాదిరి కూర్చుని ఉంటాను. ఆపైన సమయం చూసుకొని నేను కూస్తాను. నేను కూసిన మరుక్షణం నువ్వు లేచి పారిపో" అని చెప్పింది అది, జింకతో.

సరేనని జింక, కాకి చెప్పినట్లు పడి ఉన్నది. అంతలోనే పొలపు కాపు దాని దగ్గరికి వచ్చి చూశాడు. జింక కదలక మెదలక పడి ఉండటం చూసి, అతను ఆ జింక చచ్చిందని నిశ్చయించుకున్నాడు. అతను ఆ వలను తొలగించాడో లేదో, కాకి అరిచింది-వెంటనేతేరుకున్న జింక చటుక్కున లేచి, పరుగెత్తింది.

"అయ్యో! ఇదెంత మాయలమారి జింక! నన్నే మోసగించిందే!!" అని పొలపు కాపు దాని వెంటపడి పరుగెత్తుతూ, తన చేతిలోని దుడ్డుకర్రను దానిపైకి విసిరేశాడు. 'దైవ నిర్ణయమా' అన్నట్లు, ఆ దెబ్బ తగిలి, పొదల మాటున దాక్కున్న నక్క చచ్చింది.



చూడు, నక్క ఏమి ఆశించుకొని అక్కడ ఉన్నది, చివరికి ఏం జరిగింది? ఇతరులకు కీడు తలపెట్టేవాళ్లు తామే చెడిపోతారు." అని కాకి-జింకల కథను ముగించింది హిరణ్యకుడు.


ఆ మాటలు విని కాకి లఘుపతనకం హిరణ్యకుడితో- "ఎందుకు ఇట్లాంటి మాటలు? నీతో స్నేహం చేయాలని వచ్చాను. నన్ను వేరేగా అనుకోకు. నిన్ను నేను తిన్నంత మాత్రాన నా కడుపేమన్నా నిండుతుందా? నా మనవిని విను. చిత్రగ్రీవుడిని ఆదరించినట్లు, నీ స్నేహంతో నన్ను కూడా అనుగ్రహించు. నీ మంచితనమే నేను నిన్ను ఇంతగా ప్రాధేయపడేటట్లు చేస్తున్నది. నీకు నామీద దయ కలిగేంత వరకూ నిన్ను విడిచిపోను. నీలాంటి మంచి వాళ్లతో సహచర్యం చేసిన సుఖం దక్కకపోతే ఇక నా యీ జన్మ ఎందుకు?" అన్నది.

అప్పుడు హిరణ్యకుడు- "నువ్వు నిలకడలేని దానివి. ఎన్ని విధాలుగా చూసినా, చపలుడితో స్నేహం చేయకూడనిదే. అంతేకాదు- నువ్వు మాకు శత్రు పక్షంలోని దానివి. శత్రువు ఎంత మంచివాడైనా సరే, వానితో సహవాసం కూడదు. కాబట్టి, నీతో నాకు మైత్రి సరిపోదు. సాధ్యంకానిది ఎన్నటికీ సాధ్యంకాదు; సాధ్యమయ్యేది ఎన్నటికీ అసాధ్యం కాదు. నీటిమీద బళ్లూ, నేలమీద నావలూ నడుస్తాయా? అందని ఫలాలకోసం ఎందుకు అర్రులు చాస్తావు? నీపని చూసుకో. మిట్టమధ్యాహ్నం అవుతున్నది. కడుపు నింపుకోవటం గూర్చి ఆలోచించుకో. పో, పో!" అన్నది.

ఆ మాటలు విని- "నా స్వభావం ఏంటో తెలీకుండానే ఎందుకు, ఇంతలేసి వెగటు మాటలు మాట్లాడుతున్నావు? చివరగా చెప్తున్నాను విను. ఈ లోకంలో ఉన్న మంచివాళ్లలోకెల్లా మంచివాడివి నువ్వు. అలాంటి నీతో స్నేహం చేసి, చిత్రగ్రీవుడు మైత్రిలోని సుఖాన్ని చవి చూశాడు. నేను అదంతా గమనించి, నీతో చెలిమికై మనసుపడ్డాను. నా ప్రార్థన విని నువ్వు అంగీకరించావా, సరి. లేకపోతే నా భాగ్యం

ఇంతే అనుకొని, ఇక్కడే నిరాహారదీక్ష చేపట్టి , ప్రాణాలు విడుస్తాను. ఇదే నా నిశ్చయం. చెడ్డవాడి నిర్ణయాలను మట్టి కుండలాగా సులభంగా పగలగొట్టవచ్చు, కానీ అతికించటం వీలు కాదు. బంగారు కుండలో మాదిరి, మంచివారి లక్షణం దీనికి వ్యతిరేకంగా ఉంటుంది - (వారి నిర్ణయాలు సులభంగా తయారవుతాయి, కానీ వాటిని ఛేదించటం కష్టం). 'కరిగే గుణం వల్ల అన్ని లోహాలు, కారణం వల్ల జంతు-పక్షి సమూహాలు, భయంవల్ల-దురాశవల్ల మూర్ఖులు, దర్శించటంవల్ల మంచివాళ్లు కలుస్తారు'. అంతేకాదు, 'శుభ్రంగా ఉండటం, త్యాగం, శౌర్యం, సుఖ-దు:ఖాలను సమ చిత్తంతో స్వీకరించటం, దయ, స్నేహం, నిజం పలకటం'- అనేవి మంచి హృదయంగలవారి లక్షణాలు' అని చెబుతూంటారు. ఈ గుణాలన్నీ నాకు నీలో కనబడుతున్నాయి. నీలాంటి వాళ్లు వేరెవరినీ నేను కనీ, వినీ ఎరుగను. నీవంటివానితో స్నేహం సంపాదించటం కంటే మంచి పని వేరే ఏదీ లేదు.

నా కోరికను నెరవేర్చి, నాతో స్నేహం చేస్తే చాలా సంతోషపడతాను. లేకపోతే నా అదృష్టం ఇంతే అనుకుంటాను" అన్నది కాకి, హిరణ్యకునితో. (....మిగిలినది వచ్చే మాసం.)



జోకు

ఎదుగుదల!

రాము: నాన్నా! నువ్వు ఇంకా పెరుగుతున్నావా?

నాన్న: లేదురా! కొంత పెద్దయిన తర్వాత ఎదుగుదల ఆగిపోతుంది. అయినా నీకెందుకు వచ్చింది, ఆ అనుమానం?

రాము: మరి నీ తల రోజు రోజుకూ బయటికి వచ్చేస్తోంది గదా, జుట్టును దాటుకొని?!



కుందేలు-నక్క



రచన: పృథ్వి, 6 వ తరగతి, ప్రకృతిబడిం, చెన్నేకొత్తపల్లి.

ఒక ఊరిలో ఒక రైతు ఉండేవాడు. ఊరికి దూరంగా ఆ రైతుకు ఒక చిన్న పొలం ఉండేది. అతను అందులో కూరగాయలు వేసేవాడు.ఒకసారి రైతు ఆకుకూరలు వేసి, వాటి చుట్టూ ముళ్ల కంపలు నాటాడు. ఒక రోజున ఒక కుందేలు వచ్చి, ఆకుకూరలు తిన్నది. రైతు పొద్దున్నే వచ్చి చూసే సరికి, 'పొలంలోకి ఏదో జంతువు వచ్చి మేసి పోయింది' అని తెలిసింది- కానీ అది ఏ జంతువో మాత్రం తెలీలేదు.

ఎలాగైనా దాన్ని పట్టుకోవాలనుకున్నాడు రైతు. అందుకని కొన్ని త్రాళ్ళను తెచ్చి వల పన్ని పెట్టాడు పొలంలో. కానీ ఆ రోజు రాత్రి చేన్లో మేసేందుకు పోయిన కుందేలు ఆ ఉర్లను చూసి, "ఓహో! నన్ను పట్టుకోవడానికి వల పన్నాడన్నమాట, రైతు! నేను

దొరుకుతానా!?" అని వెనక్కి వెళ్లిపోయింది.

రైతు ప్రొద్దునే ఉత్సాహంగా పొలానికి పోయి చూస్తే, ఉర్లు ఎక్కడ వేసినవి అక్కడే ఉన్నై. వాటిలో ఏమీ చిక్కుకోలేదు! దాంతో అతని పట్టుదల పెరిగిపోయింది. ఈసారి అతను ఆ ఉర్లు కనబడకుండా వాటి మీద గడ్డి కప్పి పెట్టాడు.

ఆరోజు సాయంత్రం ఎప్పటిలాగే రైతు పొలంలోకి వచ్చిన కుందేలు "అహ్హహ్హా! ఒక్క రోజుతో రైతు పనైపోయింది, చూడు!" అనుకుని సంతోషంగా గెంతుతూ పరుగులు తీసి- చివరికి ఆ ఉచ్చులో చిక్కుకున్నది.

ప్రయత్నం చేసిన కొద్దీ దాని కాళ్లచుట్టూ త్రాళ్ళు బిగుస్తున్నాయి తప్ప, అది మాత్రం వలలోంచి తప్పించుకోలేకపోయింది. తెల్లవార వస్తూన్నది. రాత్రంతా పెనుగులాడిన కుందేలు ఇప్పుడు భయంతో కుదేలైంది- ఎంత ప్రయత్నించినా ఫలితం సున్న! తెల్లవారేసరికి అది పూర్తిగా అలిసిపోయింది. నిస్త్రాణంగా, నిశ్చలంగా, ఉండిపోయింది.

కొంత సేపటికి అటుగా వెళ్తున్న నక్క ఒకటి కనబడింది దానికి. అంతకుముందు అనేకసార్లు ఆ నక్క కుందేలును తినేందుకు ప్రయత్నించి భంగపడి ఉన్నది- దాన్ని చూడగానే కుందేలుకు ఇప్పుడు ప్రాణం లేచి వచ్చినట్లైంది. అది దీన్ని చూసేముందుగానే కుందేలు అరిచింది ఉత్సాహంగా- "నక్క మామా! నక్క మామా! ఎక్కడికి, వెళ్తున్నావ్?"అని. ఏదో ఆలోచించుకుంటూ, పరిసరాలను గమనించకుండా పోతున్న నక్క ఒక్క సారి ఆగి- "ఏంరా, అల్లుడూ! మా స్నేహితుడి పెళ్ళికని వెళ్తున్నాను" అని బదులిచ్చింది. ఆపైన అది చుట్టూ చూసి, "నువ్వేంటి, అట్లా ఆ గడ్డిలో కాళ్ళు పెట్టుకొని కూర్చున్నావు కులాసాగా, పనులేమీలేవా?" అని అడిగింది.

"అయ్యో, నక్కమామా! నీకు గడ్డి కనబడుతోంది తప్ప, ఇక్కడున్న ఈ ఉరులు కనబడుతున్నట్లు లేదు- ఈ త్రాళ్ళలో కాళ్ళు పెట్టి పన్నెండు గంటలపాటు కూర్చుంటే కాళ్ల నొప్పులు పోతాయి. నేను తప్పిస్తే, మా వాళ్ళు అందరూ ఇప్పటికే దీన్ని వాడుకుని అంతగా

చెంగు చెంగున గంతులు వేస్తున్నారు. ఇకనైనా నేను నా కాళ్లనొప్పులు పోగొట్టుకోకపోతే ఊరుకోమన్నారు అందరూ. అందుకని, నిన్న రాత్రినుండీ ఈ ఉర్లలోనే కాళ్ళు పెట్టుకొని కూర్చున్నాను" అన్నది కుందేలు.

నక్కకు ఆశ పుట్టింది. "ఒరేయ్, అల్లుడూ! నాకు కూడా విపరీతమైన ఒళ్ళు నొప్పులు, కాళ్ళ నొప్పులు ఉన్నాయిరా! ఈ త్రాళ్ళతో అవి పోతాయంటావా?" అని అడిగిందది.

"ఓ, పోకేమి? నొప్పులు, కాళ్ళు- అన్నీ పోతాయి- అయితే వీటిలోకాళ్ళు పెట్టుకొని కనీసం పన్నెండు గంటలు కూర్చోవాలి- కదలకుండా. అది నీవల్ల ఎక్కడౌతుందిలే, నక్కమామా!" అన్నది కుందేలు గడుసుగా.

"అయ్యో, అట్లా అనకు అల్లుడూ, నీకు తెలీదు- నేనెంత పట్టుదల గలదాన్నో! నీ తర్వాత ఈత్రాళ్ళు ఇక నావే" అని నక్క కుందేలును ఉచ్చు నుండి తప్పించి, వాటిని తన కాళ్ళకు వేసుకుని కూర్చున్నది. తప్పించుకున్నది ఆలస్యం, కుందేలు అక్కడి నుండి పారిపోయింది.

ఇక తెల్లవారుతూనే వచ్చి చూసిన రైతుకు తను పన్నిన ఉరుల్లో కులాసాగా కూర్చున్న నక్క కనబడింది. "అరే, ఇదేమి, ఉరుల్లో ఏ జింకో, కుందేలో చిక్కుకుంటుందని నేననుకుంటే, ఈ నక్క ఇక్కడ ఏంచేస్తున్నట్లు? ఇదిగానీ కాయగూరలు తిన మరగలేదు గద!" అని, రైతు ఓ బలమైన కర్రను తీసుకొచ్చి, నక్కను చితకబాదాడు!

దాంతో కుందేలుకు నక్క బాధకూడా తప్పింది!




జోకు

జీవ రహస్యం!

టీచర్: ఆక్సిజన్ లేకుండా మనిషి జీవితమే లేదు. ఈ వాయువును 1773 లో కనుగొన్నారు.

విద్యార్థి: మరి 1773 కు ముందంతా మనుషులు ఎట్లా బతికారు సార్?



రైతు-భూతం



సేకరణ: బి.మణికంఠరెడ్డి, 5 వతరగతి, జీవానంద ఇంగ్లీష్ మీడియం స్కూల్, ధర్మవరం.

అనగనగా.. ఒక మారు మూల పల్లెలో రంగన్న అనే ఒక తెలివైన రైతు ఉండేవాడు. తనకున్న కొద్దిపాటి పొలంలో ఏ కాలంలో ఏ పంట వేస్తే బాగుంటుందో చూసుకొని పంట వేసి, మంచి రాబడిని ఆర్జిస్తూ - అలా జీవనం కొనసాగిస్తూండేవాడు.

ఒక రోజు ఇంకా పొద్దు పొడవకనే లేచి, నాగలి భుజాన వేసుకొని, ఎద్దుల్ని తోలుకొని పొలందుక్కి చేయడానికి బయలుదేరాడు రంగన్న. పొలం దున్నుతుండగా నాగలికి ఏదో అడ్డు తగిలినట్లైంది. ఎద్దులు ఆగిపోయాయి. అప్పుడు మడకకు ఏదో అడ్డం వచ్చిందని గ్రహించిన రంగన్న, నాగలిని తప్పించి, అక్కడ త్రవ్వి చూశాడు. ఒక గాజు సీసా దొరికింది. దాన్ని అతను అటూ ఇటూ త్రిప్పి చూసి, మెల్లగా సీసా మూత తీశాడు.

ఆశ్చర్యం! మరుక్షణం సీసాలోంచి దట్టమైన పొగ మొదలైంది. చూస్తూండగానే ఆ పొగలో భూతం ఒకటి తయారైంది: "ఒరేయ్, మనిషీ! నువ్వు సాగు చేస్తున్న ఈ భూమి నిజానికి నాదే! ఈ భూమిలో ఎంతో కాలంగా నివాసముంటున్నాను నేను. కనుక ఈ భూమి నుండి వచ్చే ప్రతి పంటా నాదే! అదంతా నాకే సొంతం కావాలి!" అని అరిచింది ఆ భూతం.

నోటి దగ్గరి కూడు భూతం పాలవటం రంగన్నకేమీ సబబనిపించలేదు. "నేను కూడా చాలా రోజుల నుండీ ఈ భూమిని సాగు చేస్తున్నాను. కనుక ఈ భూమి నుంచి వచ్చే ఆదాయం అంతా నాదే అవుతుంది" అన్నాడు అతను ధైర్యం కూడగట్టుకొని.

"నేను చాలా రోజుల నుండీ ఈ భూమి లోపల ఉన్నాను. కనుక ఈ భూమి లోపల పండే పంట అంతా నాదే!" అన్నది భూతం పట్టు వీడకుండా.

చటుక్కున ఉపాయం తట్టిన రంగన్న "సరే, అయితే. అలాగే కానివ్వు. ఇప్పుడు నేను నేలను దుక్కి, పంట వేస్తాను. దానికి నీరు కట్టి, ఎరువు వేసే బాధ్యత నాది. కాపలా పని నీది. పంట తయారయ్యాక, ఆ పంటలో భూమి లోపలి భాగం మొత్తం నీది- భూమి పైభాగం మాత్రం నాది! సరేనా?" అన్నాడు.

భూతం ఒప్పుకున్నది. రంగన్న సంతోష పడి, పొలం సాగుచేసి, అందులో వరి నాటాడు. సమయానికి నీళ్ళు కట్టి, కలుపు తీసి, దాన్ని జాగ్రత్తగా సంరక్షించాడు. మడి చక్కగా పెరిగింది. వరి కంకులనిండా ధాన్యం తయారైంది. ధాన్యం పక్వానికి వచ్చాక, రంగన్న ఇక కోతలు మొదలుపెట్టాడు. తీరా కోతలు పూర్తయ్యే సమయానికి భూతం వచ్చి కూర్చున్నది: "ఏం, రంగన్నా! నా భాగం నాకు ఇచ్చేయి!" అన్నది.

"ఓ, అలాగే! అదిగో, పంటలో లోపలి భాగం మొత్తాన్నీ అలాగే నిలిపి ఉంచాను నీకోసం. నా మాట ప్రకారం పైభాగాన్ని మాత్రమే నేను తీసుకున్నాను. నీ వాటాను నువ్వు ఎప్పుడంటే అప్పుడు తీసుకెళ్లచ్చు" అన్నాడు రంగన్న.

లోపల అంతా తవ్వి చూస్తే వేర్లు, మట్టి

గడ్డలు తప్ప ఏమీ దొరకలేదు భూతానికి. దానికి చాలా కోపం వచ్చి, "రంగన్నా, నువ్వు నన్ను మోసం చేశావు!" అన్నది.

"నా మోసం ఏముందమ్మా, నువ్వేది అడిగావో అదే కదా నేను ఇచ్చింది?" అన్నాడు రంగన్న.

"సరే అయితే. ఈసారి పంటలో పైభాగం నాది, లోపలి భాగం నీది- సరేనా?" అన్నది భూతం.

"సరే" అని ఒప్పుకున్న రంగన్న, బాగా ఆలోచించి, ఈసారి వేరుశనగ సాగు చేయాలని నిశ్చయించుకున్నాడు. దుక్కి దున్ని, ఎరువు వేసి, విత్తనాలు విత్తి, పంటకు కాపలా కాసి, కంటికి రెప్పలా దాన్ని సంరక్షించుకుంటూ వచ్చాడు. తీరా పంటచేతికొచ్చే సమయానికి భూతం రానే వచ్చింది: "ఏమి, రంగన్నా! పంట తయారైనట్లుందే!" అన్నది.

"అవును తల్లీ, ఇక చేతికొచ్చినట్లే. ఈసారి మన ఒప్పందం ప్రకారం పంటలో పైభాగం అంతా నీదే కదా, నీ భాగం నువ్వు తీసుకెళ్ళు" అన్నాడు రంగన్న, నేల లోపల ఉన్న వేరుశనగ కాయలు పీక్కుంటూ. ఎంత వెతుక్కున్నా పంట పై భాగంలో పనికి వచ్చేది ఏమీ దొరకలేదు భూతానికి.

ఏం చేయాలో దిక్కుతోచక, అది "ఒరే, రంగన్నా మళ్ళీ మోసం చేశావు గదరా!" అన్నది.

"నేనేమీ చెయ్యలేదు గద తల్లీ, నువ్వేది కోరితే నేను దాన్నే కద, ఇచ్చాను?" అన్నాడు రంగన్న.

"అయితే ఈసారి పంటలో పైభాగమూ, క్రిందిభాగమూ రెండూ నాకే కావాలి" అన్నది భూతం.

"అదెట్లా కుదురుతుంది తల్లీ, నేనూ బ్రతకాలి గద!" అన్నాడు రంగన్న.

"అయితే మధ్యభాగం నువ్వు తీసుకో, పర్లేదు!" అన్నది భూతం దయచూపిస్తున్నట్లు.

ఈసారి రంగన్న చెరకు పంట వేశాడు. పంట చేతికందే సమయానికి హాజరైన భూతానికి చెరకు మొదళ్ళూ, ఆకులూ తప్ప వేరే ఏమీ దొరకలేదు. రంగన్న తన వాటాక్రింద

చెరకు గడలన్నీ బళ్ళలోకి ఎత్తాడు.

"ఇదిగో, ఈసారి పంటలో మధ్యభాగం నాది, చివర్లు నీవి- సరేనా?" అన్నది భూతం.

"తల్లీ, మూడు సార్లుగా చూస్తున్నాను- ఒక్కోసారీ ఒక్కోలాగా మాట్లాడుతున్నావు. ఈసారి చివరిది- చెబుతున్నాను. ఇకపైన పంట మొత్తమూ నాదే. నీదంటూ ఏమీ ఉండదు. అలా అయితేనే, ఈ సారి నేను ఏ పంటైనా వేసేది. చెప్పు మరి. ఇంకా తనివి తీరలేదా?" అన్నాడు రంగన్న, కొంచెం గట్టిగానే.



"సరేలే, ఈ ఒక్కసారికీ నాకు పంటలో మధ్యభాగం ఇచ్చెయ్. ఆపైన ఎప్పుడూ నీ జోలికి రాను. ఈ పొలాన్నే వదిలి పోతాను- సరేనా?" అన్నది భూతం.

ఈసారి రంగన్న జొన్న విత్తాడు. జొన్న కంకులు నిండుబారి, ముత్యాల్లాంటి జొన్నలు తయారవ్వగానే భూతం మళ్ళీ హాజరైంది. అయితే ఈసారి దానికి చొప్ప మాత్రం దక్కింది! రంగన్న జొన్నల్ని అన్నిటినీ బస్తాలకెత్తి బళ్ళలో ఇంటికి తోలాడు.


"అబ్బా ఈ రంగన్న చాలా తెలివైనవాడు" అనుకొన్న భూతం, తన మాట నిలుపుకునేందుకు గాను ఆ పొలం విడిచిపెట్టి పోయింది. విముక్తుడైన రంగన్న, హాయిగా పంటలు మార్చి మార్చి తన ఇష్టం కొద్దీ పండించుకుంటూ, నేలను భద్రంగా కాపాడుకున్నాడు.





దెబ్బకు రెండు

రచన: M.*ఓబుళమ్మ,, 10 వ తరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి.*



ఒక అడవిలో కుందేలు జంట ఒకటి నివసిస్తూ ఉండేది. వాటికి బాగా దు:ఖంగా ఉంటున్నది ఈమధ్య. ఏమంటే వాటికి ఆ అడవిలో బ్రతుకు దినదిన గండం అయిపోయింది.

అందుకు కారణం, ఆ అడవి అంతటికీ బలశాలి అయిన పెద్దపులి. అది చిన్న జంతువులన్నింటినీ విచక్షణా రహితంగా చంపుతూ వుండేది. దాంతో అడవిలోఉండే చిన్నా-చితకా జంతువులన్నీ ప్రాణాలు అరచేతిలోపెట్టుకొని బ్రతకాల్సి వస్తున్నది.

ఒకనాడు కుందేళ్ల జంట ఆహారం కోసం నేలలో దుంపలను త్రవ్వుకుంటున్నది. అంతలో అక్కడికి ఓ ముళ్ల పంది వచ్చింది. కుందేళ్ళు త్రవ్వుకున్న దుంపల్ని అది తినేయటం మొదలుపెట్టింది! ఆ ముళ్ళ పంది

వేరే అడవి నుండి వచ్చినట్లుంది- తన వాడి ముళ్ళను విచ్చుకొని, కుందేళ్లను బెదిరిస్తూ, అవి త్రవ్వుకున్న దుంపలను తినేస్తోంది నిబ్బరంగా!

"ఇది అన్యాయం, ముళ్ళ పందీ! ఎక్కడ నుంచోవచ్చి, మా కష్టంతో తవ్వుకొన్న దుంపలు తింటున్నావేంటి, దౌర్జన్యంగా?" అన్నాయి కుందేళ్ళు. ముళ్ల పంది ముళ్ళను నిక్క బొడుచుకొని. "దౌర్జన్యం అంటూ పెద్ద పెద్ద మాటలు మాట్లాడితే ముళ్ళతో పొడిచి చంపేస్తాను, జాగ్రత్త!" అంది.

ఇలా కుందేళ్ళు సంపాదించిన ఆహారాన్ని ముళ్ళ పంది తినేస్తూనే ఉంది. అసలే పెద్దపులి భయంతో దినదిన గండంగా బ్రతుకు సాగిస్తుండగా, దానికి తోడు ముళ్ళ పంది దాపురించటంతో ఆ కుందేళ్ల జంట ఆహారానికి మాడవలసివచ్చింది.

'ఎలాగైనా ముళ్లపంది పీడను వదిలించుకోకపోతే వీలయేటట్లు లేదు'అని కుందేళ్లు అవకాశం కోసం ఎదురు చూడసాగాయి. ఒక రోజున కుందేళ్ళు అడవిలో పోతుంటే, పొదమాటున వున్న పెద్దపులి ఠపాలున వాటి మీదికి దూకింది!

"ఈ రోజుతో భూమి మీద నూకలు చెల్లాయి" అనుకుని, భయంతో వణికిపోయాయి, కుందేళ్ళు. అది చూసి, పెద్ద పులి- "భయపడకండి కుందేళ్ళూ, నేనిప్పుడు మిమ్మల్ని చంపను. అడ్డమైన జంతువులనూ ఎక్కువగా చంపి తినటం చేత, నాకు అజీర్తి రోగం పట్టుకున్నది. నా ఆరోగ్యం బాగు పడేందుకు సరైన మార్గం ఏదైనా సూచించారంటే, ఈసారికి మిమ్మల్ని వదిలేస్తాను" అన్నది.

కుందేళ్ళకు ప్రాణం లేచివచ్చినట్లైంది. అవి ఒకదాని ముఖం ఒకటి చూసుకున్నాయి. వాటిలో ఒకటి ముందుకు వచ్చి, "మీ అజీర్తి రోగం తగ్గటానికి, నాకు తెలిసి ఒక చక్కని మార్గం వుంది. అదేమిటంటే, ముళ్ల పంది మాంసాన్ని- దాని ముళ్ళతో సహా- మింగేయటం. మీరుగానీ ఆ పని చేశారంటే, క్షణాల్లో మీకు ఇక రోగమంటూ ఉండదు" అన్నది, ఉత్సాహంగా. పెద్దపులి

సంతోషపడింది, కానీ వెంటనే దానికి ఓ అనుమానం వచ్చింది: "ఈ అడవిలో ముళ్ళ పందులు లేవుకదా, మరెలాగ?" అని అడిగిందది.

"లేకపోవటం ఏంటి? మీ అనుమతి లేకుండానే ఎక్కడి నుండో ఒక ముళ్ళ పంది వచ్చి ఇక్కడ తిష్ఠవేసింది-ఏనాడో!" అని చెప్పాయికుందేళ్లు రెండూ. "ఓహో, అట్లాగా? అయితే ఆ ముళ్లపందిని తక్షణం చంపేసి తింటాను. ముందు అది ఎక్కడుందో చూపించండి" అని గర్జించింది పెద్దపులి.

ముళ్లపంది తిరిగే చోటుకు పెద్దపులిని తీసుకొని పోయాయి కుందేళ్ళు. అపాయాన్ని గ్రహించిన ముళ్ళపంది ఆత్మరక్షణగా ముళ్ళను నిక్కబొడిచింది.

"నువ్వేం చేసినా నానుండి తప్పించుకు పోలేవు!" అని, పెద్దపులి దాన్ని ముళ్ళతో సహా నోట పెట్టుకున్నది! పులి నోట పడ్డ ముళ్ళపంది ఇక తప్పించుకోలేక, చచ్చిపోయింది. కానీ దాని ముళ్ళు పులి గొంతులో కత్తుల్లాగా గుచ్చుకున్నాయి. ఇక దాన్ని పూర్తిగా మింగలేకా, కక్కలేకా గందరగోళపడిన పులి, ఆ ముళ్ళబాధకు చచ్చింది.

ఒకే దెబ్బకు ముళ్ళపందినీ, పులినీ కూడా మట్టుబెట్టిన కుందేళ్ళు అడవిలోని జంతువులన్నిటినీ కాపాడిన హీరోలైనాయి!


ఒకే అబద్ధం

జోకు

రాము: వెయ్యి అబద్ధాలాడయినా ఓ పెళ్లి చేయమన్నారు. కానీ నేను చూడు ఒక్క అబద్ధం మాత్రమే చెప్పేసి పెళ్లి చేసుకున్నాను.

సోము: ఇంతకీ ఏమని అబద్ధమాడావు? ఉద్యోగం ఉందనా?

రాము: కాదు. ఇంతకు ముందు నాకు పెళ్లి కాలేదని!



సింహం-యువరాణి

జానపద కథలు అనేకం మన ఇళ్ళలో ఉంటై, అమ్మమ్మల దగ్గరా, తాయయ్యల దగ్గరా దాక్కొని. అలా దాక్కున్న కథనొకదాన్ని బయటికి లాగి అక్షరరూపం ఇచ్చింది, భార్గవి.

సేకరణ: K. భార్గవి, 6 వతరగతి, టింబక్టుబడి, చెన్నేకొత్తపల్లి.



కొన్ని వందల సంవత్సరాల క్రితం మొగలి చక్రవర్తి అనే రాజు ఉండేవాడు. రాజ్యాన్ని చాలా బాగా పరిపాలించేవాడు ఆయన. ఆయనంటే ప్రజలకు అభిమానం. ఆయన ఎప్పుడూ ధర్మాన్నే పాటించేవాడు. కానీ ఆయనకు ఒక్కటే బాధ- తన తర్వాత రాజ్యాన్ని పాలించే వారసులే లేరని.

ఒకరోజు ఆయన ఎక్కిన రథం పట్టు తప్పి, దారి ప్రక్కనే పోతున్న కుక్కల కుటుంబం మీదుగా పోయింది. ఎంత ప్రయత్నించినా రథాన్ని ఆపటం రాజు వల్ల కాలేదు. పాపం, ఆ కుక్కలన్నీ రథం క్రింద పడి, చచ్చిపోయాయి.

రాజు క్రిందికి దిగి చూసే సరికి, వాటిలో ఒక్క కుక్క పిల్ల మాత్రం బ్రతికి ఉన్నది. ముద్దుగా

ఉన్న ఆ కుక్క పిల్లను చూస్తే రాజుకు జాలి వేసింది. ఆయన ఆ కుక్కపిల్లను ఇంటికి తీసుకొని పోయాడు.

రాజ్యంలోని వాళ్లెవరికీ ఆ కుక్క నచ్చలేదు. ముఖ్యంగా మంత్రి, మంత్రి భార్యలకు ఆ కుక్కను చూస్తే అసహ్యంగా ఉండేది. రాజుగారు దాన్ని ముద్దు చేసినప్పుడల్లా వాళ్ళిద్దరూ ఉడుక్కునేవాళ్ళు. చివరికి ఒకరోజున మంత్రి కుక్కపిల్ల తోకమీద ఉన్న మచ్చను రాజుకు చూపెడుతూ- "మహారాజా! ఈ కుక్క చాలా దురదృష్టపు కుక్క. ఏ కుక్కకైతే తోక దగ్గర ఇలాంటి మచ్చ ఉంటుందో ఆ కుక్కవల్ల యజమానికి కీడు వాటిల్లుతుంది. కాబట్టి ఈ కుక్కను ఎలాగైనా వదిలించుకోండి" అన్నాడు.

కానీ ముద్దుగా ఉన్న కుక్కపిల్లను చూస్తే రాజుకు దాన్ని వదల బుద్ధికాలేదు. "చూడండి మంత్రి వర్యా! ఈ కుక్క ఎక్కడో అడవిలో ఉండవలసినది, తన అదృష్టం కొద్దీ రాజ మహలులోకి రాగలిగింది. ఇంత అదృష్టవంతురాలైన కుక్క వల్ల ఎవరికైనా నష్టం కలుగుతుందంటే నాకు నమ్మ బుద్ధికావటంలేదు. దీన్ని మనతోటే ఉంచుకొని, ఏమేమి నష్టాలు వస్తాయో చూద్దాం!" అన్నాడు రాజు. మంత్రి ఏమీ అనలేక ఊరుకున్నాడు, కానీ ఆ కుక్క పిల్లను చూసినప్పుడల్లా అతనికి చికాకుగా ఉండేది.

ఒకరోజు మంత్రి రాచకార్యాలలో మునిగి ఉన్న సమయంలో ఆయన గదిలోకి ఒక త్రాచు పాము దూరింది. మంత్రి దాన్ని గమనించలేదు. పని ముగించుకొని తన గదిలోకి వెళ్ళబోయిన మంత్రికి కుక్క అడ్డు వచ్చింది. మంత్రి దాన్ని ఎంత తిట్టినా, భయపెట్టినా అది అతని కాళ్లను చుట్టుకొని 'కుయ్ కుయ్ ' అంటున్నది తప్ప, అతన్ని లోనికి పోనివ్వలేదు. పని తొందరలో ఉన్న మంత్రి కుక్కను తన్ని లోనికి అడుగు పెట్టగానే, 'బుస్'మంటూ త్రాచుపాము పడగ విప్పి కనబడ్డది. అంతలో కుక్క పిల్ల అతన్ని దాటుకొని వచ్చి పాముపైన పడింది. చాలాసేపు యుద్ధం చేసి, చివరికి ఆ పామును చంపేసింది కుక్క.

అటుపైన మంత్రికి కూడా ఆ కుక్క పట్ల

ఆదరం కలిగింది. క్రమంగా అది పెద్దదై, రాజుకు మంత్రికి చాలా విశ్వాసపాత్రంగా తయారైంది.

ఆ సమయంలో రాజ్యానికి ఒక ఋషి వచ్చి, రాజుగారిని సందర్శించాడు. ఆ సమయంలో కుక్క రాజు ప్రక్కనే కూర్చొని ఉన్నది. దాన్ని చూసిన ఋషి కొంచెం సేపు కళ్ళు మూసుకొని, ధ్యానించి, "రాజా! ఇది నిజానికి కుక్క కాదు. చంద్రహాస మహారాజు కుమార్తె ఈమె. సదాచార మహర్షి శాపం వల్ల ఈమెకు ఈ రూపు వచ్చింది. ఈమె పాపం నేటితో నశించింది. త్వరలో ఈమెకు తన పూర్వరూపం రాగలదు. అయితే ఈమె మనిషిగా మారాలంటే కాకులు దూరని కారడవిలో ఉన్న 'అమృతవల్లి' మూలికను తెచ్చి, దాని రసాన్ని పూయవలసి ఉంటుంది. ఏ మహావీరుడు ఆ పని చేస్తాడో అతడే ఈమెకు భర్తై, మీ తదుపరి ఈ రాజ్య సింహాసనాన్ని అధిష్టించగలడు" అని చెప్పి, వెళ్ళిపోయాడు.

రాజుగారు ఆశ్చర్య పోయారు. తన ఇంటిలో చేరిన కుక్క నిజానికి 'చంద్రహాస మహారాజు కుమార్తె' అని తెలిసి ఆయనకు చాలా సంతోషం కలిగింది. అయితే 'అమృతవల్లి'ని తేగల వీరుడెవరు? మా పట్టిని చేపట్టగల యోధుడెవ్వడు?'అని ఆయన రాజ్యం అంతటా దండోరా వేయించాడు.



అనేక దేశాలనుండి గొప్ప గొప్ప యోధులు వచ్చి ప్రయత్నించారు గానీ కాకులు దూరని కారడవిలోకి వెళ్ళి అమృతవల్లిని ఎవ్వరూ తేలేకపోయారు. చాలామంది జాడ తెలీకుండా పోయారుకూడా.

చివరికి సింహపురి రాజ్యం నుండి విక్రముడు అనే సామాన్య వ్యక్తి ఒకడు వచ్చి తానూ ప్రయత్నిస్తానని రాజును అడిగాడు. "గొప్ప

గొప్ప యువరాజులే అమృతవల్లిని కనుక్కోలేక పోయారు. సామాన్య వ్యక్తివి, నీవల్ల ఏమౌతుంది?" అన్నాడు రాజు.

"మహారాజా! ఇన్నాళ్లుగా ప్రయత్నించిన వీరయోధులందరూ తమ ధైర్య సాహసాలపై ఆధారపడ్డారు. నేను నా ధైర్యాన్నీ, శౌర్యాన్నీ ఎలాగూ ప్రయోగిస్తాను. అయితే నాకున్న నిజమైన శక్తులు కరుణ, జాలి. అవే నాకు విజయం కలిగిస్తాయని నా విశ్వాసం" అన్నాడు విక్రముడు, కాకులు దూరని కారడవికి బయలుదేరుతూ.

అడవిలో ప్రవేశించగానే అతనికి ఒక సింహం ఎదురైంది. దానికి ఒళ్లంతా కురుపులు ఉన్నాయి. "నువ్వు అమృతవల్లి కోసం వచ్చావని నాకు తెలుసు. అయితే ఈ అడవిలో మూలిక ఒక్కరికి మాత్రమే సరిపోయేటంత ఉన్నది. నా శరీరం చూస్తున్నావు కదా, పుళ్ళు పడి నాశనమౌతున్నది. నేను బాగుపడాలంటే ఆ మూలిక నాకు అవసరం. కానీ అది నాకు అందదు. నువ్వు చెట్టెక్కి దాన్ని కోసి ఇచ్చావంటే, నాకు మేలు చేసినవాడివౌతావు" అన్నదది విక్రముడితో.



"మరి నేను వచ్చిందీ దానికోసమే కదా, నీకు కోసి ఇచ్చేస్తే, మరి రాకుమారికెలా?" అన్నాడు విక్రముడు. "అదే సమస్య. నీ ముందు వచ్చినవాళ్లంతా నన్ను మోసం చేసి మూలికను ఎత్తుకెళ్లి పోయేందుకు ప్రయత్నించారు. నువ్వూ అలాగే చేస్తావా?" అన్నది సింహం, కళ్లనీళ్ళ పర్యంతమౌతూ.

దాన్ని చూసిన విక్రముడికి జాలి వేసింది. "నాకు కావలసిన మూలికను మళ్ళీ వెతుక్కుంటానులే. ముందు నీ కష్టాన్ని తీరుస్తాను. మూలిక ఎక్కడుందో చూపించు" అన్నాడతను సింహంతో. " మూలికను

చూసిన తరువాత నన్ను మోసం చెయ్యవు గద! మోసం చేసిన వాళ్ళకు మూలిక పని చెయ్యదు!" అన్నది సింహం.

"మూలిక నీకోసమే" అని విక్రముడు ప్రమాణం చేసిన మీదట, అది విక్రముడిని వెంటబెట్టుకొని కారడవి లోపలికి తీసుకుపోయింది.

అక్కడ అమృతవల్లి మిల మిల మెరుస్తూ ఒక చెట్టుపైన కనిపించింది. అయితే అ చెట్టు మొదట్లో అనేక పాములూ, తేళ్ళూ కుప్పలు కుప్పలుగా పడి ఉన్నాయి! విక్రముడు చేతులు మోడ్చి "ఈ సింహం కష్టాన్ని నివారించటం కోసం నేను ఈ మూలికను తీసుకు రాబోతున్నాను. నా భావన నిజమైతే, ఈ విష జంతువులు నన్నేమీ చేయకుండు గాక" అని ప్రార్థించి, ధైర్యంగా చెట్టు ఎక్కటం మొదలు పెట్టాడు. ఆశ్చర్యం! పాములు-తేళ్ళు అతన్ని ఏమీ చేయలేదు!

చెట్టెక్కిన విక్రముడు మూలికను కోసుకొని క్రిందికొచ్చి, దాన్ని నలగగొట్టి, రసాన్ని సింహం శరీరం అంతటా పూసాడు. "అయ్యో! నీకు కావలసిన మూలికను నాకోసమే వాడేస్తావా?" అని సింహం బాధ పడుతూనే ఒళ్లంతా ఆ రసాన్ని రాయించుకున్నది. మరుక్షణంలో దాని కురుపులన్నీపోయి, ఒక దివ్య రూపం ఏర్పడింది. "విక్రమా, నిజంగా జాలి, దయగల వ్యక్తులకోసమే నేను ఇన్నాళ్ళూ ఎదురు చూస్తున్నాను. నీకు కనిపించింది అసలు అమృతవల్లి కాదు- నేను కల్పించిన భ్రాంతే అదంతా. ఇదిగో, నీకు అవసరమైన మూలిక, నేనే నీకు ఇస్తున్నాను. దీనితో రాకుమారికి పూర్వరూపం వస్తుంది. వెళ్ళు. నీ కరుణతో రాజ్యానికి సరైన దిశా నిర్దేశం చెయ్యి" అని, ఆ దివ్యసింహం విక్రమునికి అమృతవల్లినిచ్చి మాయమైంది.

విక్రముడు ఆ మూలికను తెచ్చి రాయగానే, కుక్కకాస్తా అందమైన యువరాణిగా మారిపోయింది. రాజుగారు ఆమెను విక్రముడికి ఇచ్చి వైభవంగా వివాహం చేశారు . అందరూ చాలా సంతోషించారు. కాలక్రమంలో విక్రముడు రాజై, రాజ్యమంతటా దయా ధర్మాల్ని పెంపొందింపజేశాడు.

నెయ్యి-పొడి-వాణి-కట్టె



సేకరణ: జి. పుష్ప, 8 వతరగతి, ప్రకృతి బడి, చెన్నేకొత్తపల్లి.

ఒక ఊరిలో ఒక భార్య-భర్త ఉండేవాళ్ళు. వాళ్ళు చాలా మంచివాళ్ళు. ఒకరినొకరు చాలా బాగా చూసుకునేవాళ్లు. ఇద్దరూ ముచ్చటగా ఒకరికొకరు ముద్దు పేర్లు పెట్టుకున్నారు. భర్తకు భార్య చేసే శనగవిత్తనాల పొడి అంటే చాలా ఇష్టం. అందుకని అతను భార్యను ముద్దుగా 'పొడీ!' అని పిలుచుకునేవాడు. భార్యకు భర్త కాచే నెయ్యంటే చాలా ఇష్టం. అందుకని ఆమె భర్తను ముద్దుగా 'నెయ్యి' అని పిలిచేది. ఇక, వాళ్ళకు రెండు ఎద్దులు ఉండేవి. వాటికి కూడా ముద్దు పేర్లు పెట్టుకున్నారు వీళ్లు. ఒక దాని పేరు వాణి. ఇంకో దాని పేరు కట్టె. అలా నెయ్యి, పొడి, వాణి, కట్టె- అందరూ కలిసి సుఖంగా బ్రతుకుతూ ఉండేవాళ్ళు.

అతిథి అభ్యాగతులు ఎవరయినా వాళ్ల ఇంటికి వస్తే, వాళ్ళకు అన్నం పెట్టకుండా పంపించేవాళ్లు కాదు పొడీ-నెయ్యిలు. ఒకరోజు మధ్యాహ్నం భోజన సమయానికి, నెయ్యి పొలం దున్నుతూ ఉంటే , ఒకవైపు నుండి ఒక స్వామి గస బోసుకుంటూ వచ్చాడక్కడికి.

"ఏంటి స్వామీ! అలసిపోయినట్టున్నారు? ప్రక్క ఊరినుండి నడుచుకొని వచ్చినట్టున్నారు, పాపం?" అని అడిగాడు నెయ్యి, ఆయన్ని.

అప్పుడు స్వామి "అవును నాయనా! ఆ ఊరినుండీ నడవటం వల్లనే అయిఉండొచ్చు, చాలా ఆయాసంగా ఉంది" అన్నాడు.

అప్పుడు నెయ్యి ఆయనకు త్రాగేందుకు నీళ్లు ఇచ్చి, "స్వామీ! నాకేమో ఇంకా కొంచెం

పని ఉన్నది. చూడగా మీకు ఆకలి వేస్తున్నట్లుంది. దూరంగా ఆ కనబడేదే మాయిల్లు. మా ఇంటిలో పాడి ఉంటుంది. వెళ్ళి అన్నం పెట్టించుకొని కడుపునిండా తినండి- ఏమీ అనుకోకండి, వెళ్ళండి!" అని చెప్పాడు.

స్వామికి "'పాడి' అంటే 'నెయ్యి'వాళ్ల భార్య" అని తెలీదు. "మామూలుగా ఊళ్లలో ప్రతి ఇంట్లోనూ చేసుకునే శనగ విత్తనాల పొడి - అదొక్కటే ఉందేమోలే, వీళ్ల ఇంట్లో"అనుకున్నాడు స్వామి.

"పొడి ఉంటే అంతే చాలు నాయనా, కాలే కడుపుకు మండే బూడిదైనా చాలు. నేను మీ ఇంటికి వెళ్ళి అన్నం తిని వెళ్తాను" అని చెప్పి నేరుగా నెయ్యి వాళ్ళ ఇంటికి పోయాడు స్వామి.

ఇంట్లో పాడి స్వామిని చూడగానే, "రండి, రండి, స్వామీ!" అని లోనికి ఆహ్వానించి, పీట వేసి కూర్చోబెట్టింది. ఆపైన ఆమె మర్యాదగా "స్వామీ! మీరు ఇప్పుడే తింటారా, లేక నెయ్యి వచ్చిన తరువాత తింటారా?" అని అడిగింది.

కానీ స్వామికి 'నెయ్యి' అంటే 'ఆవిడ భర్త' అని తెలీదు. "ఓ! నెయ్యి వస్తుందట! పొడిలోకి నెయ్యి చాలా బాగుంటుంది!" అని అనుకొని, ఆయన "పర్వాలేదులేమ్మా! నెయ్యి వచ్చిన తరువాతే తింటాను" అన్నాడు.

అంతలోనే నెయ్యి ఇల్లు చేరుకున్నాడు. అతను భోజనానికి వచ్చేందుకు పనిని ఆపి, ఎద్దుల్ని విడిపించగానే ఆ ఎద్దుల్లో ఒకటి- "కట్టె" అనేది- పారిపోయింది. 'దాని వెంటపడితే వాణి కూడా ఎక్కడికి పారిపోతుందో' అని, అతను దానిని అలాగే వదిలి, వాణిని ఇంటికి పట్టుకొచ్చాడు.



ఇంటికి రాగానే అతను పాడిని కేక వేస్తూ-

"ఏమేవ్, వాణ్ని గాటకు కట్టేయి. ఆలోగా నేను కట్టెను పట్టుకొస్తాను" అన్నాడు.


ఈ మాట విన్న స్వామి "అయ్యో! నేనేం తప్పు చేశాను దేవుడా, నన్ను గాటకు కట్టేయమంటున్నాడు? తను పోయి కట్టె తెస్తాడట. ఇక్కడే ఉంటే నన్ను చితకబాదుతారు బాబోయ్!" అనుకొని , పంచె ఎత్తుకొని వెనక్కి తిరిగి చూడకుండా బయటికి పరుగుతీశాడు.

ఆలోగా నెయ్యి వెళ్ళి, పారిపోయిన ఎద్దును పట్టుకొచ్చాడు. లోపలికి వచ్చి చూసేసరికి, అక్కడుండాల్సిన స్వామి లేడు! "అయ్యో, స్వామీ! ఎక్కడికి పోయారు?" అని బయటకు వచ్చి చూస్తే దూరంగా స్వామి పరిగెడుతూ కనబడ్డాడు.

అప్పుడు నెయ్యి ఆయన వెనకే పరుగెడుతూ "అయ్యా, స్వామీ!" అని అరవసాగాడు. 'ఎవరో పిలుస్తున్నట్లుందే' అని వెనక్కి తిరిగి చూసిన స్వామికి, నెయ్యి కనబడ్డాడు. నెయ్యి చేతిలో చర్నాకోల మెరుస్తున్నది! అతను దాన్ని ఊపుతూ, "స్వామీ! ఆగండి! రండి! పాడి ఉన్నది, నాకు మా కట్టె దొరికిందిలెండి " అని అరుస్తుంటే స్వామి ప్రాణాలు చేత బట్టుకొని పరుగుతీశాడు, వేగం పెంచి.

ఆయనను అందుకోలేని నెయ్యి "ఇదేమి, స్వామివారు ఎందుకు, నేను పిలుస్తున్నా వినిపించుకోకుండా పరుగుతీశారు? స్వాముల లీలలు బహు చిత్రాలు" అనుకుంటూ వెనుతిరిగి ఇంటికి పోయాడు!





అబ్బోడి కథ

వాస్తవానికీ, ఊహకూ మధ్య ఉండే దూరాన్ని గురించిన స్పృహ కలిగించి, తద్వారా వాస్తవంలో బ్రతకటం ఎలాగో నేర్పించటం బహుశ: జానపద కథల ఉద్దేశ్యమేమో. ఏమైనా, ఈ కథలలో హీరోలు చిన్నగాను, ఎదిగీ ఎదగకుండాను ఉంటారు; అమిత శక్తివంతులుగా ఉండి, అసామాన్య కార్యాలు సాధించి, చివరికి రాజుగారి కూతురును పెళ్లి చేసుకుంటారు! చూడండి..



సేకరణ: పి. విశ్వనాథ్,6 వతరగతి, టింబక్టు బడి, చెన్నేకొత్తపల్లి.

ఒక ఊరిలో ఒక అవ్వ ఉండేది.ఆ అవ్వకు మేకలు,ఆవులు,కోళ్ళు చాలా ఉండేవి.

ఒక రోజు కోడి ఒక చిన్నగుడ్డు పెట్టింది. ఆ గుడ్డు లోంచి బారెడు మీసం,బారెడు గడ్డం ఉన్న అబ్బోడు బయటకు వచ్చాడు.

పుట్టీ పుట్టగానే ఆ అబ్బోడు "అవ్వా! నాకు పెద్ద కొడవలి ఇవ్వు!" అన్నాడు. "సరే" అని తెచ్చి ఇచ్చింది అవ్వ.

దాన్ని పట్టుకొని , అబ్బోడు రాజుగారి వరి మడికి పోయాడు. అక్కడ ఉన్న సగం

వరినంతా కోసేశాడు.

ఆ సగం వరి మొత్తాన్నీ అబ్బోడు ఎత్తుకు పోతూ ఉంటే, అదే సమయానికి రాజు వచ్చాడు. ఆయన అబ్బోడిని, అతని శక్తిని చూసి, అబ్బుర పడ్డాడు. "నీకు ఏమి వరం కావాలో కోరుకో" అన్నాడు.

అప్పుడు ఆ అబ్బోడు "నా ఎడమ చెవి నిండా వరి పొయ్యమ"న్నాడు, అలాగే 'కుడి చెవి నిండా వరిబియ్యం పొయ్యమ'న్నాడు. అప్పుడు రాజు నవ్వి అన్నాడు, "నీ ఎడమచెవి,కుడి చెవి నిండా పిడికెడు బియ్యం కూడా పట్టవే, వాటిని ఇచ్చి ఏమి లాభం? ఇంకా వేరేదేదైనా అడుగు." అన్నాడు.

"నేను అడిగేది నేను అడిగాను. నువ్వు ఇచ్చేది నువ్వు ఇవ్వు. కావాలంటే మళ్ళీ వచ్చి ఇంకోటేదో అడుగుతానులే!" అన్నాడు అబ్బోడు.


"సరే" అని, రాజు అబ్బోడి చెవుల్లోవరి బియ్యం పోశాడు. ఎడమ చెవి అర్థానికి ఏనుగంత రాశి వచ్చింది. కుడి చెవి అర్థానికి ఇంకో ఏనుగంత రాశి వచ్చింది.

ఆ అబ్బోడు ఇంటికి వచ్చాడు. ఎడమ చెవిలోవుండే రాశినంతా కిందికి వేసేశాడు.అలాగే కుడిచెవి నిండా వుండే రాశినంతా కిందికి పడేశాడు. అవ్వ సంతోష పడ్డది.

అప్పుడు ఆ అబ్బోడు "అవ్వా! నేను రాజకుమారిని పెళ్ళి చేసుకుంటాను" అన్నాడు అవ్వతో. "రాజు నీకు బిడ్డను ఇవ్వడేమోరా, అయినా సరే, అడిగి చూడు" అనింది అవ్వ.

ఆ అబ్బోడు రాజభవనానికి వచ్చాడు. మిగిలిన వరినంతా కోశాడు. అప్పుడు రాజు "ఈసారి నీకు ఏం వరం కావాలో కోరుకో" అన్నాడు. అప్పుడు అబ్బోడు "నీ కుమార్తె కావాలి" అన్నాడు.

మాట తప్పలేక, రాజు తన కుమార్తెను ఇచ్చి పెళ్ళి చేశాడు. పెళ్ళికాగానే అబ్బోడు గొప్ప రాజకుమారుడైపోయాడు. అటు తర్వాత ఆ రాజకుమారుడు, రాజకుమార్తె సంతోషంగా జీవించారు.





అహంకారపు పురుగు

అహంకారం వినాశహేతువు. 'తనేగొప్ప' అనుకున్న లక్కపురుగుకు ఏమైందో తెలుసుకోవాలంటే ఈ కథ చదవండి:

రచన: నారాయణ, కొత్తపల్లి బృందం



అనగా అనగా ఒక ఇంట్లో ఒక బియ్యపుమూట ఉండేది. ఆ మూటలో లక్క పురుగుల గుంపొకటి హాయిగా నివసిస్తుండేది. ఇంటివాళ్లు ఏదో ఊరెళ్లారేమో, ఆ పురుగులు ఒక్కోటీ పదహార్లై, మూట అంతా కులాసాగా తిరగటం మొదలెట్టాయి.

వాటిలో ఒక కుర్ర లక్క పురుగు, చాలా తెలివైనది, ఉండేది. తన తెలివిని చూసుకొని, అది నిజంగానే చాలా గర్వపడుతుండేది. బస్తా దాన్ని ఎన్నోసార్లు హెచ్చరించినా, అది మాత్రం గర్వపడటం మానలేదు. -ఎందుకంటే, అంతకు ముందే ఓ సారి ఇంటామె గ్లాసుతో లెక్కబెట్టి రెండుసార్లు బియ్యం తీసుకున్నది చాటలోకి. మన కుర్ర లక్కపురుగు తోటి పిల్ల పురుగులతోబాటు ఆ బియ్యంలోనే

ఆడుకుంటూ ఉండింది. అయితే అది చాటలోకి పోకుండా వెంటనే తెలివిగా గ్లాసునే కరచుకొని కూర్చున్నది. ఇంటామె గ్లాసును వెనక్కి వెయ్యగానే, అది దర్జాగా నడుచుకొని బస్తాలోకి దూరింది మళ్లీ. అప్పటినుండే దానికి తన తెలివి తేటలమీద చాలా విశ్వాసం ఏర్పడిపోయింది.

ఆ తర్వాత నుండీ దానికి ఒక అనుచర బృందం ఏర్పడింది. అది వాటి ముందు ఏవేవో కోతలు కోసేది. అనుచరులు దాన్ని మరింత ఉబ్బించేవి.


వాటి ఖర్మమా అని, ఓ సారి ఇంటామె బియ్యం కొలుచుకుంటుంటే అవి అన్నీ చాటలో పడిపోయాయి. అయితే ఈసారి కుర్ర లక్కపురుగు చాటనే గట్టిగా కరచుకొని కూర్చున్నది. ఇంటామె చెరిగేసరికి, అనుచర బృందం అంతా ఎగిరి బయట పడిపోయింది. వాటికి ఏమయిందో-ఏమికాలేదోగాని, ఇంటామె చెరిగిన బియ్యాన్ని గిన్నెలో పోసుకొని, చాటను బస్తామీద పెట్టెయ్యగానే కుర్రపురుగు మాత్రం చాలా సంబరపడిపోయింది. అది ఠీవిగా చాట దిగి వచ్చేసరికి మిగిలిన పురుగులన్నీ దానికి ఓ చిన్నపాటి ఊరేగింపును కూడా నిర్వహించాయి! ప్రమాద సమయంలో దేన్ని కరచుకొని- ఎలా ఉండాలో కుర్రపురుగు ఉదాహరణ పూర్వకంగా వివరిస్తుంటే, అవన్నీ గుమిగూడి విన్నాయి. ఇప్పుడు కుర్రపురుగుకు మరిన్ని శిష్యులు ఏర్పడ్డాయి.

మర్నాటిరోజే ఇంటామె బియ్యం తీసుకొని చాటలోకి వేసుకున్నది. కుర్రపురుగు గ్లాసుని కరచుకొని ఉండలేక, చాటలోకి పడిపోయింది. ఇంటామె బియ్యం చెరిగినప్పుడు, కుర్రపురుగు చాటని కరచుకొని నిల్చింది- కానీ బియ్యం గిన్నెలోకి పోసేటప్పటికి, ఇక ఆగలేక అదీ గిన్నెలోకి పడిపోయింది. దానితో బాటే గిన్నెలోకి వచ్చిన పురుగు ఒకటి-బియ్యం కడిగినప్పుడు తేలి, ఆ నీళ్లతో బాటు బయటికి వెళ్లిపోయింది గాని, ఇది మాత్రం గిన్నెనే పట్టుకొని కూర్చుని, తనమాట వినలేదని దాన్ని తిట్టుకున్నది.

కానీ విధి లీల ఎలా ఉంటుందో చూడండి! - అది గిన్నెను కరచుకొని నిలిచి, జలప్రళయానికి

అయితే తట్టుకున్నది గానీ, ఆ గిన్నెను పొయ్యిమీద పెట్టి ఉడికించినప్పుడు, పాపం ఆ అగ్నిప్రళయానికి బలైపోయింది!

అందుకనే, 'పురుగులకు అహంకారం కూడదు' అని చెబుతారు.



జోకులు

జాబ్ గ్యారంటీ!

ఓ ఇంజనీరింగ్ కాలేజీలో తమ కొడుకును చేర్పించడానికి తీసుకొచ్చిన తల్లిదండ్రులు ముందుజాగ్రత్తగా 'ఆ కాలేజీలో తమ కొడుకును చేర్చితే బాగుంటుందా' అని చాలా మందిని విచారించారు.

చివరికి కాలేజీ గేటు దగ్గర నిలబడ్డ వాచ్ మాన్ ను కూడా అడిగితే బాగుంటుందని, అతన్ని అడిగారు "ఈ కాలేజీలో చేర్పిస్తే మా వాడు పైకొస్తాడా?" అని.

అతను చెప్పాడు: 'నేనూ ఈ కాలేజీలోనే ఇంజనీరింగ్ చేశాను. ఇదిగో- ఇప్పుడు ఇలా ఇక్కడే పనిచేస్తున్నాను. ఈ కాలేజీలో చదివితే మాత్రం జాబ్ గారంటీ..' అని.


ఎవరి గోల వారిది!

తండ్రి: బాబూ! నా గుండె ఆగిపోయేలా ఉంది. త్వరగా వెళ్లి మన ఫ్యామిలీ మొత్తాన్నీ పిలుచుకొనిరా..

కొడుకు: మీరు కంగారు పడకండి. నేను వెంటనే వెళ్లి మన ఫ్యామిలీ లాయర్ ని తీసుకవస్తా..



యుక్తి!



మూల రచన: ఉర్దూ జానపద కథ, ఎ.కె.రామానుజన్.
(*తెలుగు అనుసరణ: నారాయణ.*)

ఒక జమీందారుగారు పనిమీద వేరే ఊరికి వెళ్లారు. ఆ సమయంలో ఆయన ఇంట్లో ఘోరమైన అగ్నిప్రమాదం జరిగి, ఆయన పిల్లాపాపల్తో సహా ఆస్తి సర్వం కాలిపోయింది. జమీందారుగారికి ఈ సంగతి తెలిస్తే గుండె ఆగిపోతుంది, ఆయనకు అసలే గుండె జబ్బు కూడాను. అలాగని ఆయనకు చెప్పకుండా దాచటం ఎలా? గ్రామపెద్ద సంకటంలో పడ్డాడు. చివరికి ఓ మంగలి ముందుకొచ్చాడు- తను వెళ్లి జమీందారుకు సంగతి చెప్పి వస్తానన్నాడు.

"ఒరే, ఏదైనా తప్పు జరిగిందంటే జమీందారుగారు మనకు దక్కరు. జాగ్రత్త!" అన్నాడు గ్రామపెద్ద.



"నేను చూసుకుంటాను లెండయ్యా!" అన్నాడు మంగలి, బయలుదేరుతూ.

పొరుగూర్లో ఉన్న జమీందారు మంగలిని చూడగానే -"ఏమయ్యా! ఊర్లో అంతా బాగున్నారా?" అన్నాడు.

"ఓ, మా బాగా ఉండారయ్యా! నల్లకుక్క మాత్రం చచ్చిపోయింది" అన్నాడు మంగలి.

"అయ్యో! పాపం, చచ్చిపోయిందా? నేను బయల్దేరినప్పుడు బాగానే ఉండిందే?" అన్నాడు జమీందారు కొంచెం ఆశ్చర్యంగా.

"పాపం, బాగా అరిగినట్లు లేదండయ్యా! అంతంత గుర్రపు మాంసం తింటే మరి, ఎట్లా అరుగుతుంది?" అన్నాడు మంగలి.

"గుర్రపు మాంసం తిన్నదా? అదెక్కడ దొరికిందట దానికి?"

"ఊర్లో ఇంకెవరికి ఉన్నాయండయ్యా, గుర్రాలు? తమరి గుర్రపుశాలలో తప్ప?"

"ఏంటీ, మా గుర్రాలు చచ్చిపోయాయా?!"

"పాపం, మరి వాటిని మేపే మనుషులు లేకపోతే, అవి మాత్రం ఏం బ్రతుకుతాయి లెండయ్యా!"

"ఏమి, ఏమి అయిందట, పనివాళ్లకేమి అయిందట?!"



"అన్నం తినకుండా ఊరికే ఉపవాసం ఉండీ ఉండీ ఎవరికైనా ఏం అవుతుందండయ్యా? అదే అయ్యింది. పాపం వాళ్లకి జీతం ఇచ్చేవాళ్లే లేకపోతే, ఇక వాళ్లెట్లా ఉంటారు?"

"ఏంట్రా నువ్వనేది? వాళ్లకి జీతం ఎందుకు అందలేదు? మా దివానుకు ఏమి అయింది? మా భార్య అక్కడే ఉన్నది గదా!?"


"వాళ్లెట్లా బ్రతికి ఉంటారండయ్యా, పాపం, వాళ్లకి భోజనం పెట్టే వంటాయనే లేడు కదా!"

"ఏమి!? వంటాయనకేమి అయింది?!"

"పాపం, వాడెట్లా బ్రతుకుతాడయ్యా, వాడు పనిచేస్తున్న గదికే మంటలు వచ్చి, అవి ఇల్లంతా వ్యాపించి, ఇంట్లో ఉన్న అందరినీ కాల్చేస్తేనూ?"

జమీందారు గారికి మంగలంటే అసహ్యం వేసి, వెంటనే ఊరికి ప్రయాణమయ్యారు.

కానీ ఆయన గుండెకు మాత్రం ఏమీ కాలేదు!



చదవటం రాదు!

జోకు

పోలీసు: నీకు చదవటం వచ్చా?

ఖైదీ: రాయటం వచ్చు, కానీ చదవటం రాదు.


పోలీసు: అయితే ఈ కాగితం మీద నీ పేరు రాసివ్వు.

ఖైదీ: (ఏదో గజిబిజిగా రాసేస్తాడు)

పోలీసు: ఇదేమిటి, ఇలా పిచ్చిపిచ్చిగా రాశావ్! ఏం రాశావో చదువు..

ఖైదీ: నేను ముందునే చెప్పాను కదండీ నాకు చదవటం రాదని..రాయటం మాత్రమే వచ్చునని !

"బాల" 1952ఆగస్టు



నీళ్లుమోసే నిహాల్‌సింగ్‌కథ

పోట్లాటలు, విభేదాలు ఎక్కువైనప్పుడు, కొత్తవాళ్లని ఎవరిని చూసినా వాళ్ళు మిత్రులుగానో, శత్రువులుగానో కనబడుతుంటారు తప్ప, 'వాళ్ళూ మనుషులేగదా' అని అనిపించదు. అల్లర్లతో రాష్ట్రం అట్టుడుకుతున్న ఈ సమయంలో పర్తాప్ గారి ఈ రచన, అందరూ చదవవలసిన మంచి కథ.

ఆంగ్లమూలం: పర్తాప్ అగర్వాల్

(*తెలుగు అనుసరణ: నారాయణ.*)



యుద్ధంలో గాయపడి కదలలేక పడి ఉన్న వాళ్లకు నీళ్లు అందిస్తుంటాడు నిహాల్ సింగు. భుజంమీద గొర్రెచర్మంతో చేసిన నీళ్లసంచీని మోసుకొని, అతను యుద్ధభూమిలో ధైర్యంగా తిరుగాడేవాడు. కానీ నిహాల్ సైనికుడు కాదు- ఒక పేద 'సేవాదార్' మాత్రమే. సేవాదార్లు రణరంగంలో శవాలను ఎత్తి పూడ్చటం, కాల్చటం లాంటి తక్కువ రకపు పనులు చేస్తుంటారు.

అయితే నిహాల్ సింగుకు ఆభరణాలు-

అతని వినయశీలత, కార్యక్షమత. అతను చేసే పని కఠినమైనదే కాదు, చాలా ప్రమాదాలతో కూడుకున్నది కూడా. బరువైన 'మషాక్'ను మోసుకుంటూ, ఒక చదరపు కిలోమీటరు పరిధిలో రోజంతా తిరుగుతూ, గుర్రాలమీద, నేలమీద కత్తులు పట్టుకొని తిరిగే వీరయోధుల పాలబడకుండా తప్పించుకుంటూ- అవసరం ఉన్నవారికి నిరంతరంగా నీళ్లు అందించటం మామూలు పనికాదు.

ఆ సమయంలో పంజాబులో ప్రజలు తిరుగుబాటు చేస్తున్నారు. వారికి నాయకుడు గురుగోవిందసింగ్. గురుగోవిందసింగ్ మామూలు రాజకీయ నాయకుడు కాదు- సిక్ఖు సంస్కృతికి మూలస్తంభంగా నిలచిన మహనీయుల్లో ముఖ్యుడు, ఆయన. ఆ రోజుల్లో పంజాబుకు ఢిల్లీ రాజధానిగా ఉండేది. ఢిల్లీని మొగల్ పాదుషా ఔరంగజేబు పరిపాలించేవాడు. ఆయన విధానాలు పక్షపాత భరితంగా ఉండేవి. ఇతర మతాలను ఆయన అణచివేయనెంచాడు. గురుగోవిందసింగ్ నాయకత్వంలో ఔరంగజేబుకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమం మొదలైంది. గురూజీ పిలుపుమేరకు, పంజాబ్ లోని ప్రతి హిందూ కుటుంబమూ ఒక కొడుకును వీరసైనికుడుగా ఆయన పరం చేసింది.

నిహాల్ సింగ్ తన పనిని శ్రద్ధగానే నెరవేర్చేవాడు- కానీ అతనికి వ్యతిరేకంగా గురుగోవిందసింగ్ కు అనేక ఫిర్యాదులు అందేవి. అలా ఫిర్యాదు వచ్చినప్పుడల్లా ప్రతిసారీ గురూజీ వాటిని ప్రక్కకు నెట్టేసేవారు. నిహాల్ సింగ్ భక్తిశ్రద్ధలపైన, అతని వ్యక్తిత్వంపైన గురూజీకి విపరీతమైన నమ్మకం ఉండేది. కానీ రానురాను నిహాల్ సింగుపైన ఫిర్యాదుల వెల్లువ ఎక్కువ అవ్వటంతో, ఏమైనా చేయక తప్పని పరిస్థితి ఎదురైంది గురూజీకి.

గురూజీ న్యాయనిర్ణేతగా నిహాల్ సింగ్ పనితీరును పరిశీలించే కమిటీ ఒకటి ఏర్పడింది. వందలాది మంది సిఖ్ఖులు అక్కడ కూర్చొని చూస్తుండగా విచారణ మొదలైంది.

నిహాల్ సింగ్ పై ఇలా అభియోగం మోపారు- "యుద్ధంలో గాయపడిన సిఖ్ఖు సైనికులకు

నిహాల్ శ్రద్ధగా త్రాగునీళ్లందిస్తున్నాడు. ఇది చాలా మంచిపనే. కానీ మా పరిశీలనలో తేలింది ఏంటంటే- అతను గాయపడిన శత్రు పక్షపు సైనికులకు- ముస్లిం సైనికులకు కూడా అంతే శ్రద్ధగా నీళ్ళందిస్తున్నాడని! ఇది ఒట్టి పొరపాటు కాదు- ఎందుకంటే శత్రు సైనికులను వాళ్ల యూనిఫాం ద్వారా సులభంగానే గుర్తుపట్టవచ్చు. ఒకరు కాదు, ఇద్దరు కాదు- ఇలా చేయవద్దని నిహాల్ సింగుకు చాలామందిమి, అనేక సార్లు సూచించాం. అయినా అతను వినటం లేదు- ఎందుకు? ఈ ప్రశ్నకు అతను సరైన సమాధానం ఇవ్వకపోతే, అతన్ని కఠినంగా శిక్షించాల్సిందే!" అని.

గురువుగారు నిహాల్ ను సభలో నిలబెట్టి అడిగారు- “నిజమేనా, నిహాల్? నువ్వు ముస్లిం సైనికులకు నీళ్లు ఇస్తున్నావట, నిజమేనా?” అని.

నిహాల్ చేతులు మోడ్చి అన్నాడు " అవును, గురూజీ. నేను యుద్ధంలో గాయపడిన సైనికులందరికీ త్రాగునీళ్లు అందిస్తున్నాను. ఒకవేళ అది తప్పైతే నేను దోషినే- నాకు శిక్ష విధించండి" అని.

గురువుగారు అడిగారు- “కానీ ఎందుకు నిహాల్, అట్లా చేస్తున్నావు? మనకు 'కొందరు మిత్రులు, కొందరు శత్రువులు' అని నీకు తెలియదా? వాళ్లిద్దరికీ తేడా కనుక్కోలేవా, నువ్వు?”

నిహాల్ అన్నాడు- “నేను ఆ మషాక్ మోసుకొని వెళ్లి, గురూజీ- గాయపడిన వాళ్ళను ఎవరినైనా చూసినప్పుడు- వాళ్లంతా నాకు మీ మాదిరే కనబడతారు. హిందూ-ముస్లిం తేడాలేవీ కనబడవు నాకు, వాళ్లలో. అందరి ముఖాలలోనూ కాంతులీనుతున్న నా దైవం- తమరి ముఖమే దర్శనమిస్తుంది- నాకు అంతటా మీరే కనబడతారు- నేనేం చేసేది?” అని.

సభలోని వారంతా నిశ్చేష్టులయ్యారు. గురూజీ పట్ల నిహాల్ సింగుకు ఉన్న భక్తి తత్పరత వాళ్లందరినీ మంత్రముగ్ధుల్ని చేసింది. గురుగోవింద్ సింగ్ లేచి నిలబడి , నిహాల్ సింగ్ దగ్గరికి వెళ్లి, అతన్ని ప్రేమగా అక్కున

చేర్చుకున్నారు. నిహాల్ సింగ్ చేస్తున్న పనిని మరింత శ్రద్ధగా కొనసాగించాలని గురూజీ చెప్పినప్పుడు, అందరూ ఆమోదిస్తూ హర్షధ్వానాలు చేశారు!



రాచమార్గం

జోకులు

ధనయ్య: రామయ్యా, నాకు బాగా సంపాదించాలని ఉంది. కానీ అస్సలు కష్టపడకుండా సంపాదించాలి. అలా ఏదైనా మార్గముంటే చెప్పు!

రామయ్య:ఎందుకులేదు, ఉంది ధనయ్యా! పని చేయకుండా సంపాదించుకునేందుకు రాచ మార్గం అడుక్కోవడమే...!

కృతజ్ఞత!

రాము: సార్! మా తమ్ముడి ప్రాణాలు కాపాడింది మీరే కదండీ....

గోపి: అవును

రాము: మీ ప్రాణాలకు తెగించిమరీ మా తమ్ముడ్ని కాపాడినందుకు చాలా థ్యాక్సండీ..

గోపి: అవునూ, ఇంతకీ మీ తమ్ముడు ఇప్పుడు ఎలా ఉన్నాడు?

రాము: వాడు బానే ఉన్నాడు. కానీ..

గోపి: కానీ...చెప్పు

రాము: వాడి జేబులో ఒక వంద రూపాయలుండాలి. అవి లేవు. మీరు కానీ ఏమైనా తీశారేమోనని...

సేకరణ: వి. భాస్కర్(9వ త.), ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా.




పులి-కొడుకు

దిదాయీ జానపద కథ

మూలం: ఏ.కె.రామానుజన్, ఫోక్‌టేల్స్ ఫ్రం ఇండియా

అనువాదం: నారాయణ



ముసలిదంపతులు ఇద్దరికి పిల్లలులేరు, భూమీ లేదు. వాళ్లు కడు పేదలు. అడవిలోదొరికే వేళ్లనీ, దుంపల్నీ ఏరుకుని, తినటం వాళ్ల రోజువారీ పని.

అంతపెద్ద వయసులో ముసలమ్మ గర్భం ధరించింది. నెలలు నిండాక, ఒక రోజున అడవిలో దుంపలు తవ్వుకొంటుండగా ఆమె ప్రసవించి, మగబిడ్డ ఒకడు పుట్టాడు. ఆమె భర్తను పిలిచి "ముసలాయనా! ఇదిగో, మగపిల్లాడు పుట్టాడు. వీడిని ఏం చేద్దాం?" అని అడిగింది.

"మనం తినేందుకే ఏమీలేదు. పైన వీడినేం

పెంచుతాం?" అన్నాడు ముసలాయన.

"ఇక్కడే వదిలేసి పోదాం. వాడి రాత బాగుంటే వాడిని ఎవరో ఒకళ్లు పెంచుకుంటారు" అన్నది ముసలమ్మ.

ఇద్దరూ ఆ పసిగుడ్డును అక్కడే వదిలి ఇంటికి వెళ్లిపోయారు. పిల్లవాడు గట్టిగా ఏడుస్తుంటే విని, పులి ఒకటి అటు వైపుకు వెళ్లింది. అది ఆ పిల్లవాడిని నోట కరుచుకొని తన ఇంటికి తీసుకుపోయింది. అక్కడ అది తాగేందుకూ, తినేందుకూ వసతులు ఏర్పరిచి, వాడిని తన సొంత కొడుకులాగా పెంచింది.



పులిబిడ్డడు పెరిగి పెద్దై అందంగా, బలంగా తయారయ్యాడు. ఒకనాడు పులి వాడిని చూసి "నా కొడుకు ఇప్పుడు పెళ్లి యీడుకొచ్చాడు. ఇక వీడి కోసం ఒక భార్యను వెతకాలి" అనుకున్నది. "నేను వెళ్లి నీకోసం ఒక ఆడపిల్లను తేనా?" అని అది కొడుకును అడిగింది.

వాడన్నాడు - "నీ ఇష్టం, నాన్నా. నువ్వు నన్ను పెళ్లి చేసుకొమ్మంటే చేసుకుంటాను. నీకిష్టమైన అమ్మాయిని చూడు మరి" అని.

పులి బయటికి పోయి, ఒక ఆడపిల్ల ఎవరైనా వస్తారేమోనని ఎదురుచూసి, ఆ దారిన పోతున్న పిల్లనొకదాన్ని పట్టుకున్నది. కానీ ఆ అమ్మాయి చెవుల్ని చూస్తే దానికి నోట్లో నీళ్లూరాయి. ఒక చెవిని కొరుక్కోకుండా ఉండలేకపోయిందది. అట్లా అది ఆ పిల్లను తీసుకొచ్చి "కొడుకా, ఇదిగో నీకోసం ఒక పిల్లను తెచ్చాను. బయటికి వెళ్లి చూడు, నీకెలా అనిపిస్తుందో" అన్నది.

కొడుకు బయటికెళ్లి చూసి "ఆమెకు ఒక చెవిలేదు నాన్నా! నాకు సగం చెవుల పిల్ల వద్దు!!" అన్నాడు పులితో. పులి ఇక వరసగా ఆడపిల్లల్ని ఎత్తుకు రావటం మొదలుపెట్టింది -

ప్రతిసారీ ఆ పిల్లల చెయ్యో, ముక్కో, చెవో ఉండేది కాదు. చివరికి విసిగిపోయిన కొడుకు అన్నాడు - "నాన్నా! నాకో పూర్తి అమ్మాయిని తెచ్చిపెట్టు - ఎవరైనా ఓ మంచి అమ్మాయిని - పూర్తి అమ్మాయిని- గాయాలు లేని అమ్మాయిని తీసుకురా" అని.

ఇక అప్పుడు పులి వెళ్ళి, ఈసారి ఓ పెళ్లి పందిర్లోకి దూరింది. పెళ్లికి వచ్చిన బంధువులంతా భయపడి తలోదిక్కుకూ పరుగెత్తగానే, అది పోయి, పెళ్లి కూతుర్ని జాగ్రత్తగా ఎత్తుకెళ్లి, తన కొడుక్కిచ్చి పెళ్లి చేసింది. పులి కొడుకూ, ఆ అమ్మాయీ కొన్నాళ్ళపాటు సుఖంగా కాలం గడిపారు.

ఒక రోజున పులి కోడలు కూరగాయలు తరుగుతూండగా ఆమె వేలు తెగి రక్తం కారింది. ఆమె ఆ రక్తపు చుక్కల్ని దగ్గర్లో కనబడ్డ ఆకులతో తుడిచి, వాటిని బయట పడేసింది. పులి ఆ వాసన పట్టి, వెళ్లి, ఆకుల్ని నాకి చూసింది. వెంటనే మానవ రక్తం రుచి మళ్ళీ ఓసారి గుర్తుకొచ్చింది దానికి. "వీళ్ల రక్తమే ఇంత బాగుందంటే, ఇక వీళ్ల మాంసం ఎంత బాగుంటుందో! నేను వీళ్లను తినేస్తాను" అనుకున్నదది, ఉత్సాహంగా.


ఆ ఉత్సాహంలో అది ఆ మాటల్ని బయటికే అనేసిందో, లేకపోతే దాని కళ్లల్లో మార్పు అంత కొట్టొచ్చినట్లు ఉన్నదోగాని, కొడుకూ-కోడలూ పులి ఉద్దేశాన్ని పసిగట్టేశారు. అదే రోజున రాత్రి వాళ్లిద్దరూ ఇళ్లు వదిలిపెట్టి పారిపోయారు. ఉదయం నిద్రలేవగానే పిల్లలు లేరన్న సంగతిని కనుక్కున్నది పులి. వెంటనే అది వాళ్ల అడుగుజాడల్ని పట్టుకొని వాళ్లని వెంబడించింది.

పులి ఉద్దేశం స్పష్టంగా తెలిసిపోయిన భార్యాభర్తలిద్దరూ ఇప్పుడో చెట్టెక్కి కూర్చున్నారు. వాళ్లని వెతుక్కుంటూ పులి ఆ చెట్టుకిందికి రాగానే పులి కొడుకు దానిమీదికి దూకి, చేతనున్న కత్తితో దాన్ని పొడిచి చంపేశాడు.

ఆ తర్వాత వాళ్లిద్దరూ ఆ అమ్మాయి ఊరికి చేరుకున్నారు. ఆ అమ్మాయి తల్లిదండ్రులూ, అన్నదమ్ములూ అందరూ ఆ పిల్లపైన పూర్తిగా ఆశలు విడిచి ఉన్నారు. ఇంకా ఆమెను పులి

తినేసిందనే అనుకుంటున్నారు, వాళ్లంతా.

ఇప్పుడా పిల్ల భర్తతో సహా తిరిగి రావటం చూసి, వాళ్ళంతా ఎంతో సంతోషించారు. అటుపైన పులి కొడుకూ, కోడలూ ఆ ఊరిలో స్థిరపడి, సుఖంగా జీవించారు.



జోకులు

మతిమరుపు!

మతిమరుపు మనిషి ఒకడు తన స్నేహితునితో!

"నా గొడుగు పోయిందోయ్"

"ఎప్పుడు పోయింది?"

"ఎప్పుడు పోయిందో తెలీదు కాని, ఇందాక వర్షం తగ్గింది కదా, మూసేద్దామని చెయ్యిపైకెత్తి చూస్తే- గొడుగు లేదు!"


-'బాల' 1953, నవంబరు

మహాత్ముడు!

సుబ్బారావు: నా భార్యతోటి చాలా సమస్యగా ఉంటోందిరా! మూడు నెలల క్రితం పదివేల రూపాయలు కావాలంది. నెల గడిచిందో లేదో, ఈసారి పదిహేను వేలు అడిగింది. పోయిన వారం ఏకంగా ఇరవై వేలు ఇమ్మన్నది. ఇప్పటికిప్పుడు ఇరవై ఐదు వేలివ్వాలంటోంది! ఇలాగైతే ఎలా బ్రతకాలి చెప్పు?

రామారావు: అబ్బ! అంతంత మొత్తాలా? ఏం చేస్తుందిరా, వాటితో?

సుబ్బారావు: ఏమో, నాకేం తెలుసు? ఆమె ఎంత మొత్తుకున్నా నేను మాత్రం పైసా ఇవ్వలేదు మరి!



పుస్తకం-పెన్సిలు-రబ్బర్ల కథ

రచన: వి.పి.ఆన్సి, ఉపాధ్యాయురాలు, టింబక్టు బడి.

అనగనగా ఒక టేబుల్ ఉండేది. ఆ టేబుల్ మీద ఒక పుస్తకం ఉండేది.

పుస్తకం చాలా చాలా మంచిది. పెన్సిల్ మాత్రం చాలా కచ్చిది. అందంగా, చక్కగా ఉండే పుస్తకం అంటే దానికి చాలా కుళ్ళు. పుస్తకాన్ని అది ఎప్పుడూ హింసిస్తూండేది- దాన్ని ఎలా బాధ పెడదామా అని కుతంత్రాలు పన్నుతూ ఉండేది. అందమైన పుస్తకంమీద అసహ్యంగా పిచ్చి గీతలు గీసేయటం అన్నా, పుస్తకానికి నొప్పి పుట్టేట్లు గట్టిగా గీయటం అన్నా పెన్సిలుకు చాలా సరదాగా అనిపించేది.

ఒక రోజున పుస్తకం పెన్సిల్ తో అన్నది: "పెన్సిలన్నా,పెన్సిలన్నా! నువ్వు నామీద ఇట్లా గీసి నన్ను పాడు చేయవద్దు. అట్లా గీసేస్తే నేను చాలా గలీజుగా కనిపిస్తాను. అప్పుడిక నేను చూసేందుకు బాగుండను కదా?!" అది

వినగానే పెన్సిల్ కి ఇంకా ఎక్కువ రోషం వచ్చి పుస్తకం మీద అనవసరంగా గీయడం మొదలు పెట్టింది. తట్టుకోలేని పుస్తకానికి ఏడుపు ఆగలేదు.

పుస్తకం ఇట్లా ఏడుస్తూ ఉంటే దగ్గర్లోనే ఉన్న రబ్బర్ దాన్ని చూసి జాలిపడింది. వెంటనే అది ఒక్క దూకు దూకి, పుస్తకం మీదికి ఎక్కి కూర్చున్నది. పెన్సిల్ గీసిన చెత్త గీతలన్నిటినీ అది త్వరత్వరగా తుడిపెయ్యటం మొదలు పెట్టింది. పుస్తకానికి చాలా సంతోషం వేసింది.


రబ్బర్ చేస్తున్న పనిని చూసి పెన్సిల్ కి చాలా రోషం వచ్చింది. అది మరింత వేగంగా గీయటం మొదలు పెట్టింది.

అది ఏం గీసినా రబ్బర్ దాన్నంతా తుడిపేస్తున్నది. ఎంత వేగంగా గీసినా రబ్బర్ దానికంటే పది రెట్ల వేగంతో తుడిచేస్తూ పోతున్నది. ఇదంతా ఓ పెద్ద యుద్ధంలాగా జరుగుతోంది.

రాను రాను పెన్సిలుకు ఉక్రోషం పెరిగిపోతున్నది. "నేను సున్నితంగా, మామూలుగా ఏది రాసినా రబ్బరు దాన్ని తుడిచేస్తున్నది. అయితే నేను గానీ గట్టిగా, ఒత్తిపెట్టి, పుస్తకం చినిగేటట్లు రాస్తే- అప్పుడిక అది ఏం చేయగలదు?" అనుకున్నదది.

పైకి రబ్బరుతో, అది "అంత పని చేస్తావా , నువ్వు? అయితే ఇప్పుడు చూడు!' అని చాలా కోపంతో పుస్తకం చినిగిపోయేట్లు గట్టిగా ఒత్తిపెట్టి ఒక గీత గీయబోయింది.

ఏమైందనుకుంటున్నారు? 'టక్' అని శబ్దం వచ్చింది. గట్టిగా ఒత్తి రాయబోయిన ఆ పెన్సిల్ ములుకు కాస్తా విరిగి క్రింద పడిపోయింది.



ములుకుతోబాటు పెన్సిలు అహంకారమూ విరిగింది. ఏమీ చేయలేక, అది సిగ్గుతో తల

వంచుకుంది. అప్పటివరకూ పెన్సిలు గీసిందంతా తుడిపేస్తున్న రబ్బరు కూడా ఆ పనిని ఆపి కిసుక్కున నవ్వింది.

ఆ తరువాత పెన్సిల్ నిజంగా మారిపోయింది. అనవసరంగా అది పుస్తకం మీద ఒక్క గీతకూడా గీయటం లేదు. ఏది రాసినా అందంగా, ఇంపుగా, వరసగా రాస్తున్నది. చక్కని బొమ్మలు గీస్తున్నది. పుస్తకానికి చాలా సంతోషం కలిగింది. ఇప్పుడు పెన్సిలూ, పుస్తకమూ, రబ్బరూ మంచి స్నేహితులైపోయాయి!

జోకు

పాజిటివ్ థింకింగ్!

ఆఫీసుకని బయల్దేరి, వెంటనే మళ్లీ తిరిగి వచ్చిన భర్తతో-

భార్య: ఏమండీ, మళ్ళీ వచ్చారు, ఏమైనా మరిచి పోయారా?

భర్త: లేదు, ఏదో జ్ఞాపకం వస్తేనూ, తీసుకెళ్లడానికి వచ్చాను!

-'బాల' జులై,1954.



రాచరికం

రచన: జయరాం రెడ్డి(స్వామి), టైలరు, చెన్నేకొత్తపల్లి.



కాంచన పురం అనే రాజ్యాన్ని ధర్మధరుడనే మహారాజు పరిపాలిస్తుండేవాడు. పేరుకు తగినట్లే ఆయన ధర్మాన్ని అనుసరించి పరిపాలన సాగించేవాడు. ఆయన రాజ్యంలో ప్రజలంతా పాడి పంటలతో సుఖంగా జీవించేవాళ్లు. ప్రజలందరికీ రాజు అందుబాటులో ఉండేవాడు. ఎవ్వరైనాసరే, ఆయనను నేరుగా కలిసి, తమ సమస్యలను పరిష్కరించుకోవచ్చు; ఏ విషయంలోనైనా తమ అభిప్రాయాలను రాజుకు నేరుగా తెలియజేయవచ్చు.

ఒకసారి దసరా ఉత్సవాల సమయంలో బలశాలి అయిన యువకుడొకడు ధర్మధరుని వద్దకు వచ్చి- "మహారాజా! నా పేరు సింహబలుడు. నేనొక మల్లయోధుడిని. ఈ యావత్ సామ్రాజ్యంలో- నీతో సహా- ఎవ్వరైనా

సరే- నాతో కుస్తీకి తలపడవచ్చు. నేను ఏ ఒక్కరితో ఓడినా, నాకు శిరచ్ఛేద శిక్ష విధించండి. అయితే, నేను మీ అందరినీ గెలిస్తే మాత్రం, ఇక ఈ రాజ్యానికి నన్నే రాజును చేయాలి" అన్నాడు.

అతని మాటలకు ప్రజలలో స్తబ్దత ఏర్పడింది. అందరిలోనూ తెలియని దిగులు మొదలైంది. రాజుగారు సింహబలునితో ఎట్లా ప్రవర్తిస్తారో, తన సింహాసనాన్నే అపేక్షిస్తున్నందుకు అతనిని ఏం చేస్తారోనని ప్రజలందరూ ఊపిరి బిగబట్టి ఎదురుచూడసాగారు.

ధర్మధర మహారాజు చిరునవ్వు నవ్వాడు. మహామంత్రితో "మంత్రి వర్యా, ఒక మంచి ఆయుధం తనంతట తానుగా మన రాజ్యంలోనికి వచ్చింది. చాలా సంతోషించాల్సిన విషయం" అన్నాడు. సింహబలునితో "ఓయీ సింహబలా! ఇక్కడ జరుగుతున్నవి శక్తి సామర్థ్యాలకు సంబంధించిన వ్యక్తిగత పోటీలు కావు. ఇవి ఉత్సవాలు. ఉత్సవాల్లో వ్యక్తిగత విజయాలకంటే, సంతోషానికీ, సంబరానికీ పెద్దపీట వేయటం జరుగుతుంది. నువ్విక్కడ పోటీలలో పాల్గొనవచ్చు. అయితే బహుమతులు మా అభీష్టం మేరకు ఇవ్వబడతాయి. ఒకవేళ నీ షరతులపైనే నువ్వు పోటీచేస్తానంటే, అలాగే కానివ్వు- అయితే దానికి సమయం ఇది కాదు. సరైన సమయం, సందర్భం వచ్చేంతవరకు నువ్వు మా అతిథిగా మా రాజ్యంలోనే నివసించేందుకు ఏర్పాటు చేయగలం" అన్నాడు.

సింహబలుడు పోటీల్లో పాల్గొని రాజ్యంలోని మల్లయోధులందరినీ క్షణాల్లో మట్టి కరిపించాడు. బహుమతులందుకున్నాడు. ఆపైన మరోసారి తన కోరికను వ్యక్తం చేశాడు- 'తాను ఓడితే తనకు శిక్ష వేయవచ్చు. తాను గెలిస్తేమాత్రం తనకు రాజ్యాధికారం ఇవ్వాలి' అని. రాజుగారు "అయితే సరే, నువ్వు మారాజ్యంలో అతిథిగా కొంతకాలం ఉండమ"న్నారు. 'సరే' అన్న సింహబలునికి రాజుగారు అన్ని వసతులతోటీ నివాసం ఏర్పాటు చేశారు.

అయితే రాజుగారి చర్యలు ప్రజలెవ్వరికీ అర్థం

కాలేదు- 'రాజుగారినే సవాలు చేస్తున్న వ్యక్తికి రాజద్రోహనేరం క్రింద కారాగార శిక్ష విధించకుండా, రాజుగారు అతిథి సత్కారాలు చేయటం ఎందుకు?' అనుకున్నారందరూ.

కాంచనపురానికి పొరుగున భైరవపురం అనే రాజ్యం ఉన్నది. దానికి రాజు వక్రసేనుడు, పేరుకు తగినట్లే వక్రబుద్ధి. ఏదో ఒక వంకతో ఇతర రాజ్యాలను కబళించటం, విలాసాలకోసం ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయటం వక్రసేనుడికి అలవాటు. ఆ వక్రసేనుని వక్రదృష్టి ఇప్పుడు కాంచన పురంపై పడింది. "వక్రసేన మహారాజు ఇందుమూలంగా తెలియజేసేదేమంటే, మీరు మర్యాదగా మీ ఓటమినంగీకరించి, భైరవపురాధీశునికి తలవంచి తగిన కప్పం చెల్లించండి. లేదా, యుద్ధం తప్పదు." అని అతను ధర్మధరునికి కబురంపాడు.

మంత్రితో సహా సభలోని ఉద్యోగులందరూ అకస్మాత్తుగా వచ్చిన ఆ సందేశం పట్ల భయమూ, విచారమూ వ్యక్తం చేశారు. వక్రసేనుడి శక్తి వాళ్ళందరికీ తెలుసు. అతనితో తలపడితే కాంచననగరం మట్టిలో కలిసిపోక తప్పదు. కానీ ధర్మధరుడు వాళ్లందరికీ ధైర్యం చెప్పి, తాను సింహబలుడిని ఉంచిన వసతి గృహానికి బయలుదేరాడు.

అక్కడ సింహబలుడు అతిథిగా తనకు ఇచ్చిన వసతులను సద్వినియోగం చేసుకున్నాడు. తన బలాన్ని మరింతగా వృద్ధి చేసుకున్నాడు. అయితే ఈ క్రమంలో అతనికి ధర్మధరుని ప్రవర్తన చాలా నచ్చటం మొదలెట్టింది. ధర్మధరుడిని ప్రజలంతా ఎంత గౌరవిస్తారో అతను తెలుసుకున్నాడు. 'మంచివారికి సహాయం చేయటంకోసం నీ శక్తి యుక్తులను వినియోగించు' అని చెప్పిన తన గురువు మాటలు అతనికి జ్ఞాపకం వచ్చాయి. అతని రాజ్య కాంక్ష నశించింది. 'తాను ధర్మధరునికి సహాయం చేయగలిగే అవకాశం ఏమైనా వస్తే బాగుండును' అని అతను ఎదురుచూడసాగాడు.

ధర్మధరుడు నేరుగా సింహబలుని దగ్గరకు వెళ్లి- "సింహబలా! నీ కోరిక తీరే సమయం ఆసన్నమైంది. మన రాజ్యంలో అందరికన్నా

బలశాలివైన నీవు, మన రాజ్య సింహాసనాన్ని అధిష్టించేందుకు కూడా తగినవాడివే. అయితే నీ బలాన్ని మనరాజ్యంలోని వ్యక్తులపై కాదు నాయనా, మనమీదికి దండెత్తి వస్తున్న విదేశీ శక్తులపై చూపించగలిగితే బాగుంటుందని నా అభిప్రాయం. నిన్ను వక్రసేనుడి వద్దకు రాయబారిగా పంపనెంచాను. ప్రజలకు నష్టం కలిగించే యుద్ధాలు వద్దని వక్రసేనుడికి చెప్పి ఒప్పించు. నువ్వు తిరిగి వచ్చాక, నేను స్వయంగా నీకు పట్టాభిషేకం చేయగలను" అన్నాడు.

"మహారాజా! నా అజ్ఞానాన్ని మన్నించండి. రాజవ్వటం సుఖాస్వాదనకోసం కాదనీ, ప్రజలు మెచ్చిన రాజు అవ్వటమే పరిపాలకుని పరమార్థం అనీ గ్రహించాను. నాకు రాజ్యం అవసరం లేదు. మీ సేవకునిగా, మన రాజ్యంకోసం నా చేతనైన సహాయం నేను చేయగలను. మీ ఆదేశాన్ని శిరసా వహిస్తాను. మీకూ, మన రాజ్యానికి మచ్చరానీయనని ప్రమాణం చేస్తున్నాను" అన్నాడు సింహబలుడు రాజుతో.

ఆపైన అతను బయలుదేరి, వక్రసేనుడి దర్బారు చేరుకున్నాడు. సింహబలుడిని చూడగానే వక్రసేనుడు "ఏమిరా, ధర్మధరుడి దూతగా వచ్చావట. ఏమంటున్నాడు, ఆ పిరికిపంద?" అని గట్టిగా నవ్వాడు. సింహబలుడికి కోపం వచ్చినా తమాయించుకొని, "మహారాజా! ప్రజలకు నష్టం కలిగించే యుద్ధాలు వద్దని ధర్మధర మహారాజుగారు తమకు మనవి చేయమన్నారు" అన్నాడు. "ఒరేయ్! యుద్ధం వద్దనే పిరికి పందలు, రాజ్యాన్ని నాకు సమర్పించండిరా. నా బాహుబలానికి తలవంచి, నా కాళ్ళు మ్రొక్కండి" అన్నాడు వక్రసేనుడు . ఇక సింహబలుడు ఆగలేకపోయాడు-"మేం పిరికిపందలం కాదు మహారాజా! కేవలం ధర్మధరుని ఆదేశాన్ని అనుసరించి మీతో మర్యాదగా మాట్లాడుతున్నాం తప్పిస్తే, మాతో మల్లయుద్ధంలో తలపడి గెలిచినవాడు లేడు" అన్నాడు వేడిగా. "ఓహో! మల్లయోధుడినే పంపాడే! మా బాహువులు మర్దించటానికి

ఉవ్విళ్ళూరుతున్నె. రా,రా దూతా! నాతో మల్లయుద్ధం చెయ్యి!" అన్నాడు వక్రసేనుడు.

చెలరేగిన సింహబలుని ముందు వక్రసేనుడు ఐదునిముషాలు కూడా ఆగలేకపోయాడు. ఆ మల్లయుద్ధం ముగిసేసరికి వక్రసేనుడి ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయాయి. ఆ రాజ్యపు మంత్రులతో సహా అందరూ సంతోషంతో సింహబలుడిని అభినందించి, అతన్నే తమరాజుగా ఉండమన్నారు!

సింహబలుడు వారందరి మన్ననలూ పొంది, తిరిగి ధర్మధరుని వద్దకు వచ్చాడు. వక్రసేనుడి మృతి అతని రాజ్య ప్రజలకు సంతోషం కలిగించటం చూసి సింహబలుడికి మతిపోయినట్లైంది. 'ఇద్దరు రాజుల మధ్యా ఎంత తేడా! ఒక రాజును ప్రజలు కంటిపాపగా కాపాడుకుంటున్నారు. ఒక రాజును ఆ రాజ్య ప్రజలే ఛీదరించుకుంటున్నారు.' ఇదేమాట అతను ధర్మ ధరునితో అంటే, ఆయన "ఆ సంగతి నీకు తెలీటం కోసమే నిన్నక్కడికి పంపాను నాయనా! రాజన్నవాడికి కేవలం ఆవేశం, బాహుబలం ఉంటే చాలదు. పరిపాలన అంటే బాహుబలపరీక్ష కాదు. పరిపాలన ఎప్పుడూ ప్రజా క్షేమం కొరకే ఉండాలి. ఈ సంగతి నీకు అర్థం అయిందిగనక, ఇక నా రాజ్యాన్ని సంతోషంగా నీకు సమర్పిస్తాను" అన్నాడు.

సింహబలుడు ధర్మధరుని పాదాలపైబడి క్షమాపణ కోరుకున్నాడు. అజ్ఞానం కొద్దీ రాజ్యాధికారాన్ని ఆశించినందుకు ఏ శిక్ష విధించినా స్వీకరిస్తానన్నాడు. ధర్మధరుడు అతనిని గౌరవించి మెచ్చుకొని, తన ప్రతినిధిగా అతన్ని తిరిగి భైరవపురానికి పంపాడు! సింహబలుడు భైరవపురానికి రాజై, ధర్మధరుని అడుగుజాడలలో నడిచి, మంచిరాజుగా పేరు తెచ్చుకున్నాడు. ఇరు రాజ్యాల మైత్రీ బంధం ఆపైన చిరకాలం వర్థిల్లింది.



అమ్మా! నేను బడికి పోనే!

ఆంగ్లమూలం: ఇనుమెళ్ళ శశికళ, ది హిందూ ఓపెన్ పేజ్..
సేకరణ: విక్రాంత్ పాటిల్, బెంగుళూరు.
తెలుగు స్వేచ్ఛానుసరణ: నారాయణ.

వచన కవిత

అమ్మా! నేను బడికి పోనే!

నేనొట్టి చిన్న పిల్లనే, అమ్మా. నాకెవరైనా కథలు చెప్పాలి, నాకెవరైనా నేర్పించాలి.

కప్పపిల్లల్నీ, సీతాకోక చిలకల్నీ చూడటం నాకిష్టం- అవేం తింటాయో, ఎక్కడ నిద్రపోతాయో తెలుసుకోవటం నాకిష్టం. ఇంకా నేనో కొండనెక్కాలి, పైన ఎగిరే మబ్బుని పట్టుకొని, అది దేంతో తయారైందో చూడాలి.

పారే ఏరులో చేతులు పెట్టి చూడాలి నేను. ఈదే చేపలు నా వేళ్ళకి తగిల్తే ఎంత బాగుంటుందో చూడాలి.

కుక్క పిల్లల్తోబాటు పరుగులెత్తాలి నేను, పిట్టలతో కలిసి పాటలు పాడాలి, వానలో కాయితపు పడవల్ని తేల్చాలి.

మెత్తటి పచ్చ గడ్డిలో పడుకొని పిల్లగాలి చెప్పే కబుర్లు వినాలి- ఆ తర్వాతే నాకు వాటిని గురించి ఇంకా ఏమైనా తెలుసుకోవాలనిపిస్తుంది, ఆ తర్వాతే వాటిని చదవాలనిపిస్తుంది.

నా ఊహలు ఎగిరాకే, తెలుసుకోవాలనే దాహం మొదలయ్యాకే, 'ఎందుకు?'అనే బీజం నా మెదడును తొలిచాకే- ఏమైనా చదువుతా.

అమ్మా! నాకీ బడి జైలు వద్దే!

వాళ్ళు యంత్రాల మాదిరి చెప్పుకుపోతుంటే నా ఆత్మ ముడుచుకుపోతోందే!

మొదట్లో అడగాల్సిందేదైనా అడిగితే, వాళ్లు "అది చెప్పాలంటే సమయం చాలదు. సిలబస్

అయిపోవాలి" అంటారే!

నిజంగా అర్థం కావాలంటే నేను కొంచెం ఆగాలే. -ఆగకుండా మార్కులకోసం పరిగెత్తి నేను అలిసిపోతున్నానే!

పురాతన వస్తువుల్ని చూపించి మా టీచర్లు వాటి చరిత్ర చెప్పాలని నా కోరిక.

ప్రకృతిలో నడిపించి నిజం జీవశాస్త్రం నేర్పిస్తే బాగుండు.

బ్రద్దలయ్యే అగ్ని పర్వతాల్నీ, సముద్రాలలోని అగాధాల్నీ వీడియోల్లో చూపిస్తేనేం?

మేముండే నగరంలోని చారిత్రక కట్టడాల్నీ, సాంస్కృతిక నిర్మాణాల్నీ నిజంగా చూపిస్తేనేం?

ఖగోళ విజ్ఞానం చదివేముందు, కనీసం ఒక్కసారన్నా టెలిస్కోపులోంచి ఆకాశాన్ని చూస్తానే!

వీటన్నిటినీ ఊరికే చదవటం నాకిష్టం లేదే, అమ్మా! నేను వీలైనన్నిటిని చూడాలి, వినాలి, తాకాలి, వాసన చూడాలి, రుచి చూడాలి- నాకు వీటన్నిటి అనుభూతీ కావాలే!

బడి సంవత్సరంలో కనీసం ఒక్కసారన్నా అట్లా బైట తిప్పచ్చుగదే!



ఇంకా..

పుస్తకాల సంచీ బరువును మోసేందుకు నా నడుమును ఇంకా వంచటం నావల్ల కాదే! ఇప్పటికే నడుం విరిగేందుకు సిద్ధంగా ఉంది. అన్ని పుస్తకాలూ రోజూ ఎందుకు మొయ్యాలి, నేను? రోజుకో రెండు సబ్జెక్టులు నేర్పించచ్చుగా, ఎందుకు చేయరలాగ?

లేకపోతే వేరే దేశాల్లోలాగా బళ్లో లాకర్లు పెట్టమనండే, నా పుస్తకాల్ని అక్కడే పడేసి వస్తాను. నేను ఊపిరాడని ఆ ఆటోల్లో ఇరుక్కుని ఎందుకు పోవాలే?

ఎదగటం నాకు నచ్చట్లేదే, అమ్మా! అసలు పెద్దవ్వాలనే అనిపించట్లేదు. పెద్దైతే ఇంకా ఎక్కువ హోం వర్కులు, ఇంకా పెద్ద శీతాకాలం ప్రాజెక్టులు, వేసవి తరగతులు, వారాంతపు పరీక్షలు, నెలవారీ పరీక్షలు, మూడు నెలల పరీక్షలు, ఆరు నెలల పరీక్షలు, వార్షిక పరీక్షలు, బయటి పోటీ పరీక్షలు, ఇంకా పరీక్షలు, ఇంకా పోటీలు, ఇంకా వత్తిడి, ఇంకా ఒత్తిడి... నేనసలు పెద్దవ్వనే, అమ్మా!

నేనెప్పుడు పాడాలి, బొమ్మలకి రంగులెయ్యాలి, డాన్సు చెయ్యాలి, ఈదాలి, ఎప్పుడు సైకిల్ తొక్కాలి? ఎప్పుడు క్రికెట్ ఆడుకోను, నేను? ఎప్పుడు దాగుడు మూతలు ఆడను?

నువ్వెప్పుడూ చెబుతావే, " పిల్లలు కనీసం ఇన్ని గంటలు నిద్రపోవాలి" అని? ఆ లెక్కలు ఇప్పుడు ఎక్కడికెళ్లాయే, అమ్మా?

నేనెందుకు ఎప్పుడూ చదవాలి, చదవాలి, చదవాలి?

అమ్మా, నాకు భయమేస్తోందే. నమ్మటానికి వీల్లేని టీచర్లు చేసే చెడ్డపనులు పెరిగిపోతున్నాయే. పెద్ద పిల్లలు ర్యాగింగ్ చేస్తారట. కొందరు తిక్కోళ్లకు యాసిడ్ అంటే ఇష్టమట, వెకిలి పెద్దవాళ్లూ ఎక్కువౌతున్నారే!

అమ్మా, నాకిప్పుడే డాక్టరవ్వాలనీ లేదు; ఇంజనీరవ్వాలనీ లేదు- అసలు ఎవ్వరవ్వాలనీ లేదు.

భద్రంగా, జాగ్రత్తగా ఉండాలి, ముందు.

ఎట్లాంటి ఒత్తిడీ లేకుండా ఆడుకోవాలి. ఆడుకుంటూ నేర్చుకోవాలి, అంతే.

నాకీ బడి జైలు వద్దే, అమ్మా!




భవనాలు


నిర్వహణ: సి.హెచ్. ఆనంద్, కొత్తపల్లి బృందం.


ఇక్కడ ఒక్కో గడిలోనూ ఒక్కో భవనం ఉంది. ఒకటి, రెండు లేక మూడు అంతస్తుల భవనాలు ఇలా నిలువు-అడ్డు వరసల్లో పేర్చబడి ఉన్నాయి. ఏ వరసలోనైనా ఒకసారి వచ్చిన భవనం మళ్ళీ రాదు. ఏ గడిలో ఎంత ఎత్తు భవనం ఉందో కనుక్కొని, ఆ గడిలో ఆ అంకె రాయాలి మీరు.


భవనాలను పేర్చినప్పుడు, అన్నివైపులనుండీ అన్ని భవనాలూ కనబడవు. ఉదాహరణకు, మూడంతస్తుల భవనం వెనక ఉన్న చిన్న భవనాలేవీ ఇక ఆవైపునుండి కనబడవు. ఎటువైపునుండి చూస్తే ఎన్ని భవనాలు కనబడుతున్నాయో, చదరానికి బయట ప్రక్కగా ఉన్న అంకెలు తెలియజేస్తున్నాయి. వీటిని ఉపయోగించుకొని, అన్ని గళ్లనూ సరైన అంకెలతో నింపండి.





జవాబు ఎలా వస్తున్నదో అర్థమైందా? ఇక ఇలాంటివే మరికొన్ని సాధించండి:



1
2
2


2
1
1



3
2


2
2
2


3
3


1
3

ఇప్పుడు ఇంకొంచెం పెద్దవి: వీటిలో నాలుగంతస్తుల భవనాలూ ఉంటై!



రంగుల రాట్నం

గానం:ఎం.డి.పృథ్వి, 6 వతరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా.



అదిగో! అదిగో!
అందాల పట్నం!
పట్నంలోన బాల విహార్!
బాల విహార్లో రంగుల రాట్నం!
రాట్నం చుట్టూ
బచ్చెన గుర్రాల్!
గుర్రాలెక్కి
టక్! టక్! టక్! టక్!
గుర్రాలెక్కి
గిరగిర గిరగిర
సవారి చేదాం
చలో! చలో!

ఈ పాటల్ని వినండి!

కొత్తపల్లి పత్రికలో అచ్చైన ఈ పాటల్ని మీరు
http://kottapalli.in చిరునామా వద్ద ఇంటర్నెట్లో వినవచ్చు!

కలలు- కానుకలు



గానం: ఎన్.రాశి, ఎం.డి. పృథ్వి, ఇ.అంజలి, 6 వతరగతి, ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి,



చలికాలం వచ్చింది
సరుకు లేమి తెచ్చింది?
నిప్పులకుంపటి తెచ్చింది
వెచ్చని దుప్పటి కప్పింది

ఎండాకాలం వచ్చింది
ఏమేమి తెచ్చింది?
కాళ్ళకు చెప్పులు తెచ్చింది
నెత్తిన గొడుగు ఎత్తింది

వానాకాలం వచ్చింది
కానుకలేమి తెచ్చింది?
వాగూ వంకా వరదా
వాకిలి ముందర బురదా!

కొత్తపల్లి బృందం

సారథ్యం: సుబ్బరాజు

ప్రధాన సంపాదకులు: నారాయణ

సంపాదక వర్గం: మోహనయ్య, జయచంద్ర, మురళి.

సాంకేతిక బృందం: ఆనంద్, లక్ష్మి, లీల.

చిత్రాలు: వీరాంజనేయులు, అడవిరాముడు, ప్రసాద్, యాదగిరి, సిసింద్రి.

రూపకల్పన: సుచరిత, మంజునాథ్.

ఆర్థిక వ్యవహారాలు: అలివేలమ్మ

సహకారం: ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా.
టింబక్టుబడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా.
విజ్ఞంస్కూల్, గుడిపాల, చిత్తూరుజిల్లా.

సంవత్సర చందా: 180/రూ.

చందాను పి.అలివేలమ్మ పేరిట మనీఆర్డర్, డి.డి., చెక్కు రూపంలో కట్టవచ్చును. డి.డి., చెక్కులకు బ్యాంకు చార్జీలు (25 రూ) కలపాలని మనవి.

చందాలకై చిరునామా: పి. అలివేలమ్మ, కొత్తపల్లి బృందం, C/o ప్రకృతిబడి, చెన్నేకొత్తపల్లి, అనంతపురంజిల్లా, 515 101.

బ్యాంకు ద్వారా చందా కట్టడానికి వివరాలు:
సి.ఎచ్. రాము, A/c No:62079470871,
స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాదు, శాంతి నగర్ బ్రాంచి,
హైదరాబాద్. డబ్బు కట్టిన వివరాలను ఇమెయిలు/ఫోను/ఉత్తరం ద్వారా కొత్తపల్లికి తెలియపరచగలరు.

మా చిరునామా:

కొత్తపల్లి ప్రచురణలు, ఇంటి నెం: 2-312, న్యామద్దల రోడ్డు, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా, 515 101.
ఇమెయిలు: team@kottapalli.in
ఫోను: 08559 240222

కృతజ్ఞతలు

the timbaktu collective — in celebration of life — www.timbaktu.org
ubuntu — www.ubuntu.org
Infogami — www.infogami.org
python — www.python.org
OpenOffice.org — www.openoffice.org
Unicode — www.unicode.org
బరహ — www.baraha.com
Audacity — www.audacity.org
www.gimp.org
SCIM — www.scim.org
creative commons — www.creativecommons.org

కొత్తపల్లి గురించి ఓ పేజీ...

పూర్వం ఒక రాజుగారికి ఉన్న నలుగురు కొడుకులూ అప్రయోజకులయ్యారట. బహుశ: తండ్రిగారి క్రమశిక్షణ మరీ ఎక్కువైపోయిందేమో, వాళ్లకి ఏం చెప్పినా అర్థం కావట్లేదు. తల్లిదండ్రులూ, అమాత్యులూ, గురువులూ ఏం చెప్పాలని నోరు తెరిచినా వాళ్ల చెవులు మూసుకుపోతున్నాయి. తెలివి తేటలకేమీ తక్కువ లేదు. ఉన్నదల్లా అప్రయోజకత్వమే.

చివరికి రాజుగారు విష్ణుశర్మ అనే పండితుడిని రావించి, ఆయన్ని గౌరవించి, తన కొడుకుల్ని చూపించి, "వీళ్లని మీరే తీర్చిదిద్దాల"ని వేడుకున్నారు.విష్ణుశర్మగారు 'సరే' అని వాళ్లని వెంటబెట్టుకెళ్ళారు. ఆరు నెలల్లో వాళ్లు నలుగురూ ప్రయోజకులై తిరిగి వచ్చారు!

విష్ణుశర్మ వాళ్లమీద వ్యాకరణ శాస్త్రాలనూ, వేదమంత్రాలనూ, క్షత్రియోచిత యుద్ధ విద్యల్నీ రుద్దలేదు. పుస్తకాలు ముందు పడేసి చదవకపోతే ఊరుకోనని ఉరమలేదు. కథలు చెబుతూ పోయాడు. ఆ కథలే రాజుగారి కొడుకుల్ని ప్రయోజకుల్ని చేశాయి. నీతి చంద్రికగానూ, పంచతంత్రంగానూ పేరొందాయి.

కథలు, ఆటలు, పాటలు వృధాపోవు. వాటిలో పిల్లలకు వాళ్లదైన ఒక ప్రపంచం దొరుకుతుంది. ఆ ప్రపంచంలో స్వేచ్ఛగా రెక్కలార్చుకుంటూ తిరిగి, వాళ్లు ఇతర ప్రాపంచిక విషయాల్ని సునాయాసంగా నేర్చుకుంటారు.

కథలు, ఆట పాటలు సేద తీరుస్తాయి. సేద తీరిన మనసులు ఊరట చెంది, మంచి మనుషుల్ని తయారు చేస్తాయి. సమాజంలో శాస్త్ర విషయాల్ని లోతుగా నేర్వాలంటే మనుషులకు వాటి పట్ల మక్కువ అవసరం. కళలు ఆ మక్కువని నిర్మిస్తాయి.

తెలుగు పిల్లలకు సంతోషాన్ని ఇచ్చేందుకుగాను మానవీయ స్పర్శ ఉన్న కథల్ని, ఆటపాటల్ని , విద్యా, విజ్ఞాన, వినోదాల్నీ పిల్లల స్వీయ దృక్పథంలో, బేషరతుగా అందించే ఉద్దేశంతో "కొత్తపల్లి" మీ ముందు నిల్చింది. తెలుగునాట పిల్లల సృజనను, వారి పఠనాసక్తిని ప్రోత్సహిస్తూ, వ్యాపారాపేక్ష లేకుండా పిల్లల కోసమే నిలిచే మరిన్ని కొత్త పల్లెలు తయారయ్యేందుకు సాయపడటం మా అందరి అభిమతం.

కొత్తపల్లి పత్రిక ను ఎవరైనా స్వేచ్ఛగా ముద్రించుకోవచ్చు, పంచుకోవచ్చు, అచ్చైన కథల్ని మార్చి రాసుకోవచ్చు: కేవలం వాటి మూల కృతిని సదరు రచయితలకూ, "కొత్తపల్లి బృందం (http://kottapalli.in)" వారికీ, ఆపాదిస్తే సరి.